2014 సెప్టెంబర్

# పరిశుద్ధత

ఆధ్యాత్మిక క్రైస్తవ మాసపత్రిక

ప్రధాన సంపాదకులు :

**రెవ.డా॥ కె. జోసఫ్**

సర్క్యులేషన్ :

**సామ్రాట్ కొడవటికంటి**

**చందా వివరములు :**

సంవత్సర చందా రూ. 100/-

పోషక చందా రూ. 500/-

జీవిత చందా రూ. 1000/-

విడి ప్రతి రూ. 10/-

**మా చిరునామా :**

ఎడిటర్

పరిశుద్ధత

పోస్‌బాక్స్ నెం. 28

ఒంగోలు - 523001

ఫోన్ : 08592-231281

## లోపలి పేజీల్లో...

సంపాదకీయం 02
ఎడిటర్

అపొస్తలుడు కొడవటికంటి 03

లియో టాల్‌స్టాయ్ ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ 06

క్రైస్తవులు భయపడతగునా
ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ 10

నీ శత్రువుతో నీ దేవుడు యుద్ధము చేయును 11
శ్రీమతి మాధురిమరియన్

సాతాను చేతిలో సాంకేతిక పరిజ్ఞానం 13
బ్రదర్ కె. సామ్రాట్‌గారు

మానవుడు శ్రీమతి కమలా సామ్రాట్ 16

యెరూషలేము చరిత్ర
రెవ. డా॥ కొడవటికంటి విక్రాంత్ 18

మార్టిన్‌లూథర్ శ్రీమతి రిబ్కా విక్రాంత్ 21

అక్షరయజ్ఞం - బైబిల్ క్విజ్ 24
శ్రీమతి కె.ప్రసన్న పరాక్రమ్‌గారు

India Evangelistic & Relief Fellowship

| **EVANGELISM** | **RELIEF** |
|---|---|
| Church Planting | Orphanage |
| Evangelestic, Crusades | Child Development Centers |
| Pastor's Seminars | Education (U.C.L.I. Schools) |
| Youth Ministry | Widows & Leprosy Care |
| T.V.Ministry | Medical Assistance |
| Magazine Ministry | Help in Natural Calamity |
| Audio Ministry | Flood Relief |
| Jail & Prison Ministry | Mobile Medical Ministry |
| IERF International | Children Care Ministry |
| Hanna Women Ministries | |

**ప్రకటన రేట్లు**

| | | |
|---|---|---|
| టైటిల్ 4వ పేజీ | ..... | రూ. 3,000/- |
| టైటిల్ 3వ పేజీ | ..... | రూ. 2,000/- |
| లోపలి పేజీ | ..... | రూ. 1,000/- |

# సంపాదకీయం.....



ప్రభువునందు ప్రియ పరిశుద్ధ పాఠకులందరికీ నా హృదయపూర్వక ధన్యవాదములు.

పత్రికను ప్రశంసిస్తూ వ్రాసిన ఉత్తరాలనుబట్టి ఫోన్‌కాల్స్‌నుబట్టి నా ధన్యవాదములు. పత్రిక ఆలస్యముగా వస్తుందని అనేకమంది ఫోన్‌ద్వారా, ఉత్తరాల ద్వారా తెలియచేస్తున్నారు. మేము ప్రతి నెలా 15వ తేదీకల్లా పోస్ట్ చేస్తాము. అయితే పోస్టల్ వారి ఆలస్యం వల్ల మీకు ఆలస్యంగా అందుతున్నందుకు మేము చింతిస్తున్నాము. అందుకోసమే గత నెలలో 'పరిశుద్ధత' మాసపత్రిక ఇంటర్నెట్ ఎడిషన్‌ను ప్రారంభించామని తెలియజేయుటకు సంతోషిస్తున్నాను. ఒకవేళ మీకు ఇంటర్నెట్ ఉన్నట్లయితే మీకు పోస్ట్‌లో పత్రిక రావటం ఆలస్యం అయితే పత్రికను ఇంటర్నెట్‌లో www.holinessmagazine.com అనే వెబ్‌సైట్ ద్వారా చదువుకోవచ్చు, డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అంతేకాక పాత సంచికలు కూడా మీరు డౌన్‌లోడ్ చేసుకొని చదువుకోవచ్చు. ఎంతో వ్యయప్రయాసలకోర్చి పత్రికను నడిపిస్తున్నామంటే అందుకు కారణం, మీరు పత్రిక ద్వారా ఆధ్యాత్మిక మేలులు పొందుకోవాలన్న దృఢ సంకల్పమే. కాబట్టి మీరు ప్రతి నెలా క్రమం తప్పకుండా పత్రిక చదవండి. అంతేకాక మీ యొక్కసలహాలు సూచనలు తెలియజేయటం ద్వారా, పత్రిక అభివృద్ధికి దోహదపడిన వారవుతారు. ప్రభువు మిమ్మును ప్రేరేపించినట్లయితే పత్రిక కొరకు చందాదారులుగా చేరి ఆర్థికంగా సహాయపడండి. ప్రభువు మిమ్మును, మీ కుటుంబాలను దీవించును గాక!

–ఎడిటర్

సీరియల్

# అపొస్తలుడు

7

– కొడవటికంటి

బండి, కొండను చుట్టి వచ్చేటప్పటికి సూర్యుడు బాగా పైకి లేచాడు. దాదాపు ఉదయం పదిగంటలు అయింది. ఎదురుగా యొర్దాను, యొర్దాను మీద పడిన సూర్యకిరణాలు, ఎత్తులో నుండి క్రిందకు దిగుతున్న వారి కళ్ళకు ఎర్రగా కనిపిస్తున్నాయి. యొర్దాను గట్టు మీద చెట్లు పెరగటం వలన ఎండ వేడిమి కొంచెం తగ్గింది. వందలాది మనుష్యులు చెట్ల నీడలలో కూర్చుని ఉన్నారు. కొంతమంది పండుకొని విశ్రాంతి తీసుకుంటున్నారు. బండి కొంచెం దూరంగా, మనుష్యుల దృష్టిని ఆకర్షించకుండా దూరంగా నిలిపి, అందరూ క్రిందకు దిగారు. సౌలు యొక్క ఖరీదైన దుస్తులు అంతగా నలగలేదు. కాని అజూబా, హదన్యా అంగీలు బాగా నలిగిపోయాయి.

కొంచెంసేపు దూరం నుంచే చుట్టు ప్రక్కల వారి పరిస్థితులను గమనించారు. యోహాను ఇంకా రాలేదు. శిష్యులు మాత్రం బాప్తిస్మము తీసుకోడానికి వచ్చిన వారిని వరుసలుగా కూర్చోపెడుతున్నారు. స్త్రీలకు ఎవరికీ బాప్తిస్మము అవసరం లేదు. వారిని పూర్తి మనుష్యులుగా అంగీకరించరు. సౌలు కొంచెం ఆలోచనలో ఉన్నాడు ఆదిలో దేవుడు వారిని స్త్రీనిగాను, పురుషునిగాను సృజించాడు అని ఉంది. స్త్రీని ముందుగా ఉంచాడు. ఇద్దరికి సమాన ప్రతిపత్తి. ఒకరు ఎక్కువ, ఒకరు తక్కువ అన్న ఆలోచన అసలు లేదు.

కాని ఆ పండు తిన్న తర్వాత దేవుడు స్త్రీకి భర్త యెడల వాంఛ కలుగజేశాడు. ఆ వాంఛ ఆమె బలహీనతయై పురుష ఆధిక్యతకు దారితీసింది. ఏ మనిషికైనా అతని వాంఛ అతనిని బానిసను చేస్తుంది. ఏ వాంఛ లేనివారు ఎవరు ఉంటారు? రబ్బీగా, యూదా మత ప్రవిష్టునిగా ఉండాలనే వాంఛ తనని మొదటగా తల్లిదండ్రుల నుండి, తర్వాత భార్య నుండి దూరం చేసింది. తనతోటి వారంతా ఆ మహా పట్టణమైన తార్సులో ఆనందంగా జీవిస్తున్నారు.

యొర్దానుకు దూరంగా కనుచూపు మేరలో ఉన్న కొండ క్రింద భాగంలో అలజడి కనిపిస్తుంది. యోహాను చేతిలోని కర్ర పెద్దదే. చేతులు కాళ్ళు పూర్తిగా వస్త్రహీనంగాను, భుజముల నుండి మోకాళ్ళ వరకు గట్టి వస్త్రము, ఒంటె రోమములతో నేయబడినది ధరించి యున్నాడు. ఆయన నడుస్తూ వస్తుంటే వెనుకనే సుమారు పదిమంది శిష్యులు వెంబడిస్తున్నారు. వారు బయలుదేరిన కొండగుహ నేలకు పది అడుగుల ఎత్తులో ఉంది

తన రాజ్య సింహాసనము నుండి భటుల మధ్య మహారాజులా ఠీవిగా నడచివస్తున్న ఆ యోగిని చూసి యొర్దాను నది ఒడ్డున ఉన్న జనసమూహమంతా సంతోషంతో పులకించిపోయారు. ప్రపంచంలో ఏ చక్రవర్తి అయినా ఇంత హృదయపూర్వకమైన ఆహ్వానం పొందాడా? అని పౌలు ప్రశ్నించుకున్నాడు. పసిపిల్లలు, యువతీ యువకులు సంతోషంగా ఎదురు పరిగెత్తారు. వారిని చూస్తూ చిరునవ్వు నవ్వుతూ వారి తలమీద, కొంతమంది భుజముల మీద చేతులుంచి, నడచి యొర్దాను ఒడ్డున ఉన్న ఒక ఎత్తైన చెట్టు మొదట్లో ఉన్న పెద్ద రాతిమీద కూర్చున్నాడు. శిష్యులు ఆయన చుట్టూ మనుష్యులు మీదకు రాకుండా అడ్డుపడుతూ వారిని కూర్చోపెడు తున్నారు. మొదట్లో ఆకాశాన్నంటిన ఆ ఉత్సాహధ్వని చిన్నగా తగ్గుస్థాయికి వచ్చి ఇప్పుడు నిశబ్దంగా ఉన్నారు.

యోహాను లేచి నిలబడినప్పుడు మరలా మూకుమ్మడిగా జనసమూహములు ఆకాశంవైపు లేచి మరలా సర్దుకొన్నది. ముందు వరుసలో కూర్చున్న వారు బాప్తిస్మములకై వచ్చిన వారు. వారితో జనం ఇంకా కలుస్తున్నారు. వారితో యోహాను ఒక అర్ధగంట మాట్లాడిన తరువాత నీళ్ళలోకి దిగటానికి గట్టు వెంబడి రేవు వైపుగా నడుస్తూ నదికి అవతలి వైపున చెట్టు క్రింద నిలబడి ఉన్న యాజకులను లేవీయులను చూచి ఒక్క నిమిషం ఆగాడు.

వారు బాప్తిస్మం కోసం వచ్చిన వారు కాదని వారిని చూచిన వెంటనే అర్ధమవుతుంది. యోహాను తమను గమనించిన సంగతి గుర్తెరిగిన సౌలు, యాజకులు కదలి యొర్దాను గట్టు మీదుగా నడచి నదిలో ప్రవేశించారు. బెత్‌బెరా వద్ద యొర్దాను నది వెడల్పు డెబ్బై అడుగులు ఉంటుంది. లోతు మోకాలు లోతు మాత్రమే ఉంది. అందువలన బాప్తిస్మము కోసము యోహాను ఉత్తరం వైపున కొంచెం దూరం వెళ్ళవలసి వచ్చింది. యెరూషలేము నుండి వచ్చిన యాజకులు నీళ్ళలో దిగటం చూసి యోహాను ఆగి పోయాడు. యాజకుల కంటే ప్రవక్త గొప్పవాడు కనుక యోహాని ముఖం మీద వున్న తేజస్సు వలన ఇంతవరకు ఆయనను గురించి తప్పుగా మాట్లాడినదంతా అబద్ధం అని అనిపించింది. అయినా యెరూషలేము సనెహెడ్రన్ సభ యొక్క ప్రతినిధులము, మరియు వారికి నివేదిక సమర్పించ వలసిన వారము అనే భావన కలిగినప్పుడు బాధ్యాతా యుతంగా దగ్గరకు వచ్చి మర్యాద పూర్వకంగా అభివందనం తెలిపారు.

అందరిలోనూ నెమ్మదైనవాడుగా ఎంచబడిన లెహో యేలు యోహాను దగ్గరకు వచ్చి "మేము యెరూషలేము మహాసభ నుండి వచ్చియున్నాము" అన్నాడు.

యోహానుకు అర్థమయ్యింది అన్నట్లు తలూపి ప్రక్కన ఉన్న శిష్యులవైపు చూస్తూ ప్రక్కనే ఉన్న పసిపిల్లలను దూరం అన్నట్లు చూశాడు.

లెహోయేలు "అయ్యా మీరు క్రీస్తువారా?" అన్నాడు.

"కాదు, కాదు" అన్నాడు యోహాను.

వెంటనే అజూబా "మరి నీవెవరు, నీవు ఏలియావా?" అని అడిగాడు.

సౌలు శరీరం మళ్ళీ పులకించిపోయింది. సౌలు దృష్టిలో ఏలియా ఆరడుగుల బలమైన శరీరం, పెద్ద దుప్పటి కప్పుకొని, దాదాపు అరవై సంవత్సరాల వయస్సు కలిగినవాడు. కాని తన ఎదురుగా ఉన్న వ్యక్తి బలహీనంగా, ముఖంలో కాంతి ఉన్నా ఎందుకో ఏలియాలాగా అతనిని సౌలు చూడలేకపోయాడు.

"కాను" అన్నాడు యోహాను ముక్తసరిగా.

వెంటనే అజూబా "మోషేగారు సెలవిచ్చిన ఆ ప్రవక్తవా?" అని అడిగాడు. ఈసారి మాటలలో కొంచెం మర్యాద తగ్గినట్లుగా కనిపించింది.

యోహాను గమనించే కొలది ఆయన మీద గౌరవం పెరుగుతుంది. ఇప్పుడు సౌలు మనస్సులోని ఏలియా రూపం కొద్దికొద్దిగా మెరుగులు దిద్దుకొని ఈ ఎదురుగా ఉన్న యోహానువలె కనిపించాడు. సౌలు కొంచెం ముందుకు నడిచి పొడి దగ్గు దగ్గాడు. యోహాను సౌలు వైపు చూచాడు.

సౌలు "అయ్యా, మీరెవరు? మేము ఇప్పుడు యెరూషలేము వెళ్ళి మమ్ములను పంపిన వారికి మిమ్ములను గూర్చి ఏమి చెప్పాలి? మీరేమి చెబుతారు?" అని వినయంగా అడిగాడు.

సౌలు యొక్క భాషాచాతుర్యానికి యోహాను కొంచెం ముగ్ధుడయ్యాడు. ఎస్సీను తెగవారిలో ఎక్కువమంది ఇలాగే మాట్లాడతారు.

యోహాను వెంటనే "యెషయా ప్రవక్త చెప్పినట్లు, ప్రభువు త్రోవ సరాళము చేయుడి అని అరణ్యములో ఎలుగెత్తి చెప్పే ఒకని స్వరం" అని అంటుంటే జన సమూహం నుండి పెద్ద అలజడి వినిపించింది. ఎండ ఎక్కువయ్యేకొద్దీ ప్రజలలో అసహనం ఎకువయ్యింది. యోహాను మాటలు వినాలని కూర్చున్న వారికి మధ్యలో వచ్చిన యెరూషలేము వాస్తవులైన పరిసయ్యుల ఆటంకం ఓర్చుకోలేకపోయారు. యోహాను శిష్యులు ప్రజలలోకి వెళ్ళి నెమ్మది అని సైగచేస్తూ ఉండగా మిగిలిన యాజకులను కూడా ఈ పరిస్థితి అంత సంతోషకరంగా లేదు.

యోహాను ఈ యాజక బృందాన్ని చూసి అటు భయపడలేదు, ఎదిరించనూ లేదు కూడా. యోహాను ఏ మార్పు కనబరచకపోవడం, యోహానులో మతపరమైన ఏ నేరమూ కనుగొనకపోవటం విసుకుగా ఉంది. చివరకు "నీవు క్రీస్తువైననూ, ఏలియావైనను, ఆ ప్రవక్తవైనను కాని యెడల ఎందుకు బాప్తిస్మము ఇస్తున్నావు?" అని విసుకుగా అన్నాడు.

యోహాను "నేను నీళ్ళతో బాప్తిస్మమిస్తున్నాను గాని నా వెనుక వచ్చువాడు మీ మధ్యన ఉన్నాడు మీరాయనను ఎరుగరు.

సౌలుకు ఈ మాటలు ఎక్కడో దూరంగా ఉన్న కొండలలో నుండి కాని, ఎత్తైన ఆకాశములోని మేఘాల మధ్య నుండి వస్తున్నట్లుగా అనిపించింది. "మీ మధ్యన ఉన్నాడు అంటున్నాడు ఏమిటి?" అనుకున్నాడు.

"ఆయన చెప్పుల వారును విప్పటానికైనా నేను యోగ్యుడను కాను" అంటూ నీళ్ళలోకి దిగటానికి మొదలుపెట్టాడు. అతని వెనుక ఇద్దరు శిష్యులు కూడ నీళ్ళలోకి దిగుతున్నారు.

యెరూషలేము నుండి వచ్చిన వారి కార్యము ముగిసింది. పరిసయ్యుల తెగలోనివారు, సద్దూకయ్యుల తెగలోని వారు కలసి బాప్తిస్మమునకు వచ్చియుండటం, వారంతా ఎంతో భక్తిగౌరవాలతో యోహాను దగ్గరకు రావటం గమనించారు. మరలా తమ బగ్గీ వద్దకు నడుస్తున్నారు. సౌలు నిదానంగా తలవంచుకొని నడుస్తున్నాడు. ఇంత గొప్ప చదువులు చదివిన తన దగ్గర లేనిది, తను సాధించలేనిది ఏదో యోహాను కలిగియున్నాడు అని అనుకున్నాడు.

తిరుగు ప్రయాణంలో ఒకటి రెండు ఆలోచనలు తప్ప ఎవరు ఎక్కువగా మాట్లాడలేదు.

లెహాయేలు "మీరాయనను ఎరుగరు, ఆయన మీ మధ్యనే ఉన్నాడు అని అంటున్నాడు. ఎవరిని గురించి? ఆయన గురువు గురించా? యోహాను గురువుగారు ఎవరు?" అని అనుకున్నాడు తనలో తానే.

"ఇతను ఎస్సీనుల నుండి వచ్చినవాడు. ఎస్సీనులలో గురువులుండరు" అని కొంచెం ఆగి "మెస్సియాను గురించి కదా యెష్షయిగారు వ్రాసినది. మెస్సియాకు ముందుగా పంపబడెడి ప్రవక్తయైన ఏలియావా? అని అడిగితే అతను కాదు అని అన్నాడుగా!" అన్నాడు సౌలు.

అజూబా కలుగజేసుకొని "అతని గురించి అతనికే తెలియదు ఇక మనకు ఏం తెలుస్తుంది" అన్నాడు.

మోరియా కొండలలో ఒకదానిమీద పూర్వీకుడైన అబ్రాహాము తన ఏకైక కుమారుని బలి అర్పించ బోయినందువలన ఈ కొండలు పుణ్యక్షేత్రాలయ్యాయి. యెబూసును యెరూషలేముగా మార్చటంలో దావీదు మహారాజు ఉద్దేశ్యం అదేనేమో. సౌలు ఆలోచిస్తుంటే అజూబా మరలా "యోహానుగారికి ఈ యొర్దానులో బాప్తిస్మం ఇవ్వమని దేవుడే చెప్పాడట" అన్నాడు. యోహాను పేరు ఎత్తగానే సౌలుకు ఏలియా పేరు విన్నట్లు అనిపించింది.

మరలా అజూబా "చిన్నతనంలోనే యాజకుడైన తన తండ్రి తల్లి మరణిస్తే అప్పటి నుండి అరణ్యంలోనే పెరిగాడట" మనసులోని మాట పైకి అనేసినట్లు అన్నాడు.

అందరూ ఎవరికి వారు వారిలో వారు, ఆలోచనల్లో ఉంటే బండి నిదానంగా బలంగా కదులుతుంది.

చిన్నతనం నుండి గ్రామంలో నిసించిన యోహాను అడవి తేనే మిడతలే ఆహారంగా తీసుకుంటున్నాడు. నేటికీ అదే ఆహారం. దైవచింతన తప్ప మనిషిని ఏ ఉపద్రవమైనా ఈ లోకచింతన నుండి దూరం చెయ్యలేదు కదా అనుకున్నాడు సౌలు.

లెహాయేలు కలుగజేసుకొని "మెస్సయ్య చేతిలో చేట వుంది అంటాడు యోహాను. ఆ చేటతోనే గోధుమలను పొట్టును వేరుచేసి పొట్టును మెస్సయ్య అగ్నితో కాల్చి వేస్తాడట" అని చెప్పాడు.

సౌలు కల్పించుకొని "ఏదో ఒకరోజున హఠాత్తుగా మెస్సయ్య ఆలయములో ప్రత్యక్షమవుతారని ఈ రోమీయులను వెళ్ళగొట్టి దావీదు సింహాసనము స్థాపిస్తాడని మనం చెపుతుంటే మరి ఈయన ఈ విధంగా చెప్తున్నాడేంటి" అని అన్నాడు.

అలా అంటున్నప్పుడు అతని హృదయంలో యోహాను మెదిలాడు. తను కూడా తన జీవితాన్ని దేవుని కార్యం కోసమై సమర్పించుకొని స్వదేశాన్ని బంధువులను వదలి ఇన్ని సంవత్సరాలు విద్యనభ్యసించి చట్ట ప్రకారం రబ్బీగా మారటానికై నాలుగు సంవత్సరాలు స్వదేశంలో పని చెయ్యటానికి వెళ్తున్నాడు. **(సశేషం)**

సీరియల్ 7

# చేజారిన అవకాశం

## (లియో టాల్‌స్టాయ్)

**ఒక ఊరిలో ఇవాన్ నివశిస్తున్నాడు.** ధనవంతుడైనా కష్టజీవి. ముగ్గురు కుమారులు ఉన్నారు. అతని భార్య ఇవానోవా. చాలా తెలివైనది. మంచిది. ఇవాన్ తండ్రి ఏడు సంవత్సరాలుగా ఉబ్బసముతో బాధపడుతున్నాడు. పని చేయకుండా ఉండేవాడు. కాని ఇంటిల్లిపాది కష్టంచేసి బ్రతికేవారు. జీవితం ఏ ఒడిదుడుకులు లేకుండా సాగిపోతుంది. ప్రక్కింటిలో "గోర్గే" అనే వారి కుటుంబము నివశిస్తున్నది. వారు, వీరు కూడా చాలా అన్యోన్యంగా జీవిస్తూ ఒకరి అవసరాలు మరొకరు తీర్చుకుంటూ ఉండేవారు. ఈ ఇంటిలో కూడా ఓ పెద్దాయన ఉన్నాడు. ఏవైనా చిన్న చిక్కులు వచ్చినప్పుడు ఈ పెద్ద వయస్సున్నవారు సరిచేసుకొని పోయేవారు.

కొన్ని సంవత్సరాలైన తర్వాత రెండిండ్లల్లోను యవ్వనస్తులు వ్యవసాయం ప్రారంభించారు. ఇవాన్ ఇంటిలో ఓ కోడి గుడ్లు పెట్టడం ప్రారంభించింది. అది రోజు పశువుల పాకలో గాదె క్రింద గుడ్డు పెట్టేది. ఇవాన్ కోడలు సాయంకాలం వెళ్ళి ఆ కోడి గ్రుడ్డును ఇంట్లోకి తెచ్చి దాచిపెట్టేది. ఒకరోజు ఆ కోడిని పిల్లలు బెదిరించారు. అది రెండు ఇండ్ల మధ్యలో కంచె దాటి "గోర్గే" దొడ్లోకి వెళ్ళింది. ఇవాన్ కోడలు సాయంకాలం గుడ్డుకోసం వెళితే గుడ్డులేదు. ఇంట్లోకి వచ్చి అందరిని 'గుడ్డు తీశారా?' అని అడిగింది. అందరు 'మాకు తెలియదు' అన్నారు. కానీ ఇవాన్ ఆఖరి తమ్ముడు ఇంట్లోకి వస్తూ "నీ కోడి ప్రక్కింట్లో దొడ్లోకి వెళ్ళడం నేను చూశాను" అన్నాడు.

ఆ అమ్మాయి ప్రక్కింటికి వెళ్ళి "మాకోడి మీ ఇంట్లో గ్రుడ్డు పెట్టింది చూశారా?" అని అడిగింది.

ఆ ఇంట్లో ఉన్న ముసలామె "మా ఇంటికి మీ కోడి రాలేదమ్మా! మా కోళ్ళు పెట్టే గుడ్లే మాకు ఎక్కువైనాయి. ఇరుగుపొరుగు వాళ్ళ కోడిగుడ్లు మాకెందుకు?" అన్నది.

ఈ విధమైన మాటలు ఇవాన్ కోడలికి కోపం తెప్పించాయి. ఆ ముసలామె మాటలకి ఇంకా నాలుగు కలిపి ఇంకా కోపంగా వడ్డించింది.

కొంచెంసేపటికి 'గోర్గే' ఇంటివారు ఇవాన్ ఇంటివారు ఒక్కొక్కరు కలిసి గోలగోలగా అరుచుకోవడం ప్రారంభించారు. ఇంతవరకు వారి స్నేహము, ప్రేమ అందరు మరచిపోయి ఒకరిని మించిన కోపంతో ఒకరు అరుచుకోవడం ప్రారంభించారు. కొంచెంసేపటికి బూతులు తిట్టుకోవడం ప్రారంభించారు.

తర్వాత మరి కొంచెం సేపట్లోకే మాటలు ఆగిపోయి చేతులతో కొట్టుకోవడం ప్రారంభించారు. ఇవాన్ చొక్కాని గోర్గే పట్టుకొంటే, గోర్గే గడ్డం సగం ఇవాన్ వలన పోయింది. ఇంతలో బయట జనం మూగి వారిని విడిపించారు.

గోర్గే ఆ గడ్డం మూటగట్టి పట్టణ న్యాయాధిపతి వద్దకు వెళ్ళాడు. ఇవాన్ యొక్క ముసలి తండ్రి ఇంటివారినందరిని పిలిచి ఈ విధమైన తగాదాలు మాని సమాధానంగా జీవించమన్నాడు. కాని అతనిని ఎవరు పట్టించుకోలేదు. ఇవాన్ కోడలు "వాళ్ళు మనల్ని చెడ్డ మనుష్యులు అని తిట్టారు" అన్నది.

"వాళ్ళు అలా పిలిచినా మనం చెడ్డకు మంచి చెయ్యాలి. ఇప్పుడు మీరు వారితో సమాధానపడితే మంచిది. లేకుంటే ముందుముందు ఎక్కువ కష్టాలు పడవలసివస్తుంది" అన్నాడు.

"గోర్గే నా చొక్కా చించాడు. కాని వాని కుమారుడు నా ప్యాంటు కూడా చించాడు. వానికి బుద్ధి చెబుతాను" అని చినిగిన చొక్కా తీసుకొని గ్రామ న్యాయాధిపతి వద్దకు వెళ్ళి గోర్గే మీద ఫిర్యాదు చేశాడు ఇవాన్. కాని అతను ఆశించినట్లు జరుగలేదు. కనుక కోర్టులో కేసు పెట్టాడు. ఆడవాళ్ళు కాక రెండు కుటుంబాలలోని చిన్న పిల్లలు కూడా చీటికి మాటికి గొడవపడేవారు.నెలకు ఒక్కసారైనా ఏదో

ఒక తగాదాతో కోర్టుకు వెళ్ళేవారు. ఒక్కోసారి – ఇవాన్ డబ్బు చెల్లించటమో లేక నాలుగు రోజులు జైలులో గడపడమో, అదేవిధంగా గోర్గేకూడా డబ్బు చెల్లించడమో జైలులో నాలుగు రోజులు గడపడమో జరిగేది. అలా జరిగినప్పుడెల్లా వారు మరెక్కువగా తగువు లాడుకొనేవారు.

ఈవిధంగా ఆరు సంవత్సరాలు గడిచిపోయాయి. ఇవాన్ ముసలి తండ్రి అనేకసార్లు "నాయనలారా! ఈ తగాదాలు మానుకొని పొలం పని చూసుకోండి. ఈ విధమైన జీవితంలో నెమ్మది ఉండదు" అని చెబుతుండేవాడు. అయినా ఎవరూ ఆయన మాటలు పట్టించుకోలేదు.

ఇవాన్ కోడలు ఓ పెండ్లి విందులో గోర్గే తమ గుఱ్ఱం దొంగిలించాడని అన్నది. అప్పటికే త్రాగి ఉన్న గోర్గే ఆమెను బలంగా కొట్టాడు. ఆమె వారం రోజులు మంచంలో ఉన్నది. ఈ విషయంలో ఇవాన్ సంతోషించాడు. ఎలాగైనా గోర్గేని సైబేరియా జైలులో పెట్టించాలని జిల్లా కోర్టులో కేసు నమోదు చేసి, క్రింది అధికారులకు లంచాలు ఇవ్వడానికి చాలా డబ్బు ఖర్చుచేశాడు. ఫలితంగా గోర్గేకు ఇరవై బెత్తపు దెబ్బలు, పదిమందిలో కొట్టాలని తీర్పు వచ్చింది.

బెత్తపు దెబ్బలు తిన్న గోర్గే బజారులో ఇవాన్‌ని కలిసి "నా వీపు దెబ్బలతో మండిపోయింది. ఫరవాలేదు నీక్కూడా ఇంతకంటే ఎక్కువ మంట కలుగుతుంది" అని చెప్పి వెళ్ళిపోయాడు. వెంటనే ఇవాన్ కోర్టుకు వెళ్ళి "గోర్గే నా ఇల్లు తగులబెడతానని బెదిరించాడు" అని చెప్పాడు.

వెంటనే గోర్గేను పిలిపించి "నీవు ఇవాన్ ఇల్లు తగులబెడతానని అన్నావటగా?" అని అడిగారు.

"నేను అలా అనలేదు. నీవు నాకు ఎన్ని బెత్తం దెబ్బలన్నా ఇప్పించగలవు, నీకు ఆ శక్తి ఉన్నది. నిజం కొరకు న్యాయం కొరకు నేనొక్కడినే ఇన్ని దెబ్బలు తినాలా?" అన్నాను. అని ఇంకా ఏమో చెప్పబోయాడు కాని అతని పెదాలు వణకడం ప్రారంభమయ్యాయి. నోట మాట లేకుండా నేలను చూస్తూ వణికిపోసాగాడు. అతని స్థితిని గమనించిన న్యాయమూర్తులు కూడా అతని చూసి జాలిపడ్డారు.

వారిలో వృద్ధుడైన న్యాయాధిపతి ''చూడండి సోదరులారా! మీరిద్దరు ఈ విధంగా సంవత్సరాల తరబడి తగువులాడుకోవడం ఏమి బాగోలేదు. బలహీనురాలైన స్త్రీని గోర్గే కొట్టడం తప్పే! దేవుని కృపవలన ఆ అమ్మాయి చనిపోలేదు. ఒకవేళ ఆమె చనిపోయి ఉంటే ఏమైయుండేది? కనుక మీరిద్దరు సమాధానపడాలి" అన్నాడు.

కాని కోర్టు సెక్రెటరి "అదేమి కుదరదు. ఆర్టికల్ 117 ప్రకారం తీర్పు ఇవ్వవలసిందే" అన్నాడు.

అందుకు జడ్జి "నువ్వు అధికముగా మాట్లాడుతున్నావు. మొదట దేవుని చట్టం – అదే నిన్ను వలె నీ పొరుగువానిని ప్రేమించు అనేది నెరవేరాలి" అన్నాడు.

అయితే గోర్గే ఈ మాటలు పట్టించుకోలేదు. "నాకు ఇప్పుడు యాభై సంవత్సరాల వయస్సు. ఈ విధంగా దెబ్బలకు నా వీపు ఎన్నడు ఇవ్వలేదు. ఇప్పుడు ఇవాన్ వలన నేను ఈ స్థితికి వచ్చాను. అది నేను గుర్తుంచుకుంటాను" అని వణుకుతున్న కంఠముతో నేలవైపు చూడసాగాడు.

ఇవాన్ ఇంటికి వెళ్ళాడు. ఇంట్లో ఎవరూ లేరు. పొలం నుండి ఇంకా రాలేదు. ఒక్కడే చెక్క కుర్చీలో కూర్చున్నాడు. అతను ఆలోచించ సాగాడు. జరిగిన సంగతులు అతనికి ఎదురుగా నిలిచాయి. మొట్టమొదట బెత్తం దెబ్బల తీర్పు వచ్చినప్పుడు గోర్గే ఎలా వణికిపోయాడో, నిశ్శబ్దంగా గోడను చూస్తు ఎలా వున్నాడో ఆలోచించాడు. ఒకవేళ ఆ శిక్ష తనకే పడితే తాను ఏమి చేసి ఉండేవాడు? ఇంతలో అతని తండ్రి గదిలోకి వచ్చాడు. ఆయన దగ్గుతూ ''గోర్గేకు శిక్ష పడిందా?" అన్నాడు.

"ఔను ఇరవై బెత్తం దెబ్బలు అన్నాడు" ఇవాన్.

ఆ పెద్దాయన విచారంగా "ఇదేమి బాగోలేదు. గోర్గేకి దెబ్బలు పడితే నీకేమి ఒరుగుతుంది?" అన్నాడు కడు విచారముతో. "అతను మరలా ఓ స్త్రీని కొట్టాడు" అన్నాడు ఇవాన్. "నీవు అతనికి చేసిన – చేస్తున్నదేమి అతను చేయలేదే" అన్నాడు తండ్రి.

ఈ మాటలకి ఇవాన్‌కి కోపం వచ్చింది. "నా ఇల్లు తగులబెడతా నన్నాడు" అని అరిచాడు.

"ఇవాన్! నువ్వు బలవంతుడివి. ఎక్కడికైనా ఎప్పుడైనా వెళ్ళగలవు. కాని నేను చాలాకాలంగా మంచంలో ఉన్నాను. నీవనుకొంటున్నావు నీకు చాలా తెలుసునని. నాకంటే తెలివిగలవాడినని. నీవు ఇంకా చిన్నవాడివే. కాని నీ తప్పులు నీకు కనిపించవు. పూర్వం ఈ రెండు ఇళ్ళు ఒకటిగా ఉండేవి. సంతోషంగా ఉండేవి. యుద్ధంలో ఉన్న జవానుకి నీకు ఏమీ తేడాలేదు. యేసుప్రభువు ఏమి చెప్పాడు? నేను చిన్నప్పటి నుండి ఎలా పెంచాను? ఎవరైనా ఓ చెంపమీద కొడితే రెండవ చెంప త్రిప్పమన్నాడు ఔనా? కనుక నీ గర్వాన్ని తగ్గించు కోవలసి ఉన్నది" అన్నాడు.

ఇవాన్ మౌనంగా ఉన్నాడు. తండ్రి మాటలు అతని హృదయం లోపల పనిచేస్తున్నాయి.

పెద్దాయన దగ్గి మరలా "యేసుప్రభువు మనల్ని దుర్మార్గులు అని పిలిచాడు. ఆయన మనకొరకు సిలువలో మరణించలేదా? నువ్వు ఈ లోకము గురించి మాత్రమే ఆలోచిస్తున్నావు. ఇన్ని రోజులు కోర్టు కేసుల కొరకు ఎంత డబ్బు తగలేశావు? నీ పొలంలో పంట ఎందుకు పడిపోయింది? నీ పిల్లలు ఎందుకు సంతోషంగా లేరు? సరైన సమయంలో పొలం దున్ని సరైన సమయంలో నాట్లు వేశావా? ఈ రోజంతా నీవిక్కడే గడపావు. నీ పొరుగువానికి శిక్ష పడేటట్లు చేశావు. ఒకరోజు నీకు అదే సంభవించవచ్చును. నిన్నెవరైనా కష్టపెడితే యేసుక్రీస్తు నామములో వారిని క్షమించు. అప్పుడు నీవు వృద్ధి చెందుతావు. నీ హృదయంలో నుండి ఆనందం ఎక్కడికి పోదు" అన్నాడు ఇవాన్ తండ్రి.

ఇవాన్ మౌనంగా కూర్చున్నాడు.

"పెద్దవాడిని! సలహా తీసుకో. నా గుఱ్ఱం ఎక్కి కోర్టుకు వెళ్ళి నీ పొరుగు వానిమీద నీవు పెట్టిన అభియోగాలన్నిటిని వెనక్కు తీసుకో. రేపు గోర్గే దగ్గరకు వెళ్ళు. యేసుప్రభువు నామమున అతనిని మన ఇంటికి ఆహ్వానించు. రేపు పరిశుద్ధదినము (పరిశుద్ధ మరియమ్మ పుట్టినరోజు)" అన్నాడు.

ఇవాన్ పెద్దగా నిట్టూర్చాడు. హృదయం తేలిక అయినట్లుగా ఉన్నది. 'తండ్రి చెప్పినది మంచిదే. కాని దానిని చేతలలో చూపించడం ఎలా సాధ్యము?' అనుకొన్నాడు.

"లేచి వెళ్ళు ఇవాన్! రగులుతున్న మంట పెద్దది కాకముందే ఆర్పివేయి. లేకుంటే అది లోకాన్నంతటిని దహిస్తుంది" అన్నాడు. ఇంతలో పొలం నుండి స్త్రీలు, పిల్లలు లోనికి వచ్చారు. వచ్చీరాగానే గోర్గేని గురించి మాట్లాడుతూనే ఉన్నారు. అతనికి ఇరవై బెత్తపు దెబ్బలు పడతాయని. ఇంకా ఏవేవో కొన్ని కల్పిత కథలను చెప్పసాగారు. 'గోర్గే కోడలు ఊర్లో అందరికి కథలు చెబుతుంది' అని – 'ఈ ఊరి టీచర్‌గారు ఇవాన్ మీద "జార్" చక్రవర్తికి పిటీషన్ ఒకటి వ్రాశాడని, అందువలన ఇవాన్ ఆస్థిలో సగము గోర్గేకి ఇవ్వబడుతుందని పుకారు వ్యాపించిందని' చెప్పారు.

ఇదంతా మౌనంగా విన్న ఇవాన్ కోపంతో ఊగిపోయాడు. అప్పుడు అతని హృదయంలో మరలా మంట ప్రారంభమైంది. ఇవాన్ ఎప్పుడు తీరుబడిలేకుండా ఉంటాడు. ఇంటిపనులు చేస్తుంటాడు. ఇవాన్ బయటికి వచ్చాడు. సంధ్యా సమయములో పిల్లలు పొలం దున్నే పని ముగించుకొని వచ్చారు. వాళ్ళని కలుసుకొని పొలం విషయం అడిగాడు. చీకటి పడిన తర్వాత తలుపు మూసి లోనికి వెళ్ళాడు. ఇంతలో తండ్రి చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయి. బయటికి వెళ్దామని తలుపు తెరవబోయేటప్పటికి బయట గోర్గే స్వరము "ఆ సైతానుతో నాకేమి పని? వాడికి మరణం తథ్యము" అని తనను గురించి గోర్గే ఎవరితోనో చెబుతున్నాడు.

ఇవాన్ కొంచెంసేపు లోనే నిలబడి ఆలోచిస్తూ గదిలోకి వెళ్ళాడు. అతను ఇంట్లోకి వచ్చినప్పుడు ఇల్లంతా ప్రశాంతంగా ఉంది. స్త్రీలు భోజనము తయారుచేస్తున్నారు. రెండవవాడు వాయిద్యము వాయిస్తున్నాడు. చక్కని ఆహ్లాదకర వాతావరణము కనిపించింది. పోతే పొరుగువారితో ఉన్న పోరు అనే చీకటి కోణం కనబడుతున్నది. ఇవాన్ బయటకు వచ్చాడు. చీకటిగా, కొంచెం మబ్బుగా ఉన్నది. గోర్గే మాటలు "త్వరలో ఒక ఆస్తి తగలబడి పోతుంది" అన్న మాటలు అతని మస్తిష్కములో నుండి బయటకు వస్తున్నాయి.

**(సశేషం)**

# క్రైస్తవులు భయపడతగునా? 6

## గ్రహాంతర రక్షకుడు?

గ్రహాంతర వాసుల సందర్శనానికి ఇది అనుకూల సమయము? గడచిన కాలంలో గ్రహాంతర వాసుల ఉనికి కనుగొనబడింది. ఎక్కడో మారుమూల ప్రాంతంలో ఒకరో, ఇద్దరో చూశారనే సాక్ష్యం కంటె ఇప్పుడు పట్టణాల్లో ఎక్కువ మందికి గ్రహాంతర వాసులు దర్శనమిస్తున్నారన్నది సత్యం. గ్రహాంతర వాసులు అంటే దుష్టశక్తులు కాదని వారు ఈ విశ్వంలోని వేరే గ్రహాలలో నివశించె వారని ప్రజలు అర్థం చేసుకోవటానికి సినిమాలు, కథలు పుస్తకాలు సహాయ పడుతున్నాయి (ఎఫెసి 6:12)

గ్రహాంతర జీవుల గురించి చెప్పబడింది ఏమంటే – వీరు ఇతర గ్రహము నుండి రక్షకుడిని తీసుకొని వచ్చి ఈ మానవుల బలహీనతలు, సమస్యలు, ఘోరమైన స్థితిని తొలగింపజేస్తారు. ఇంక ఇలా అంటారు – వీరు ఇవన్ని తప్పించుకోవడానికి అతని వంటి అక్షయ దేహం పొందే పరికరాన్ని ఇస్తాడని అది వారి శరీరంలోకి పంపితే ఈ లోకం నుండి ఒక క్రొత్త లోకంలోకి తీసుకొని పోతారు. సాతానుడు వానిదూతలు నిత్య నరకంలోకి పోకుండా మనుష్య కుమారుని అడ్డుకుంటాడని సాతాను ఓ పెద్ద అబద్ధాన్ని సృష్టించాడు.

ఇది ఒక అబద్ధం, ఊబిలాంటిది. అయితే సాతాను ఇలాంటి కార్యక్రమాలు చేయటం నోవాహు దినాలలో జరిగినట్లు జరుగుస్తుందని యేసుప్రభువు చెప్పాడు. సిలువ వేయబడుటకు ముందు ఒలీవ – తోటలో ఆయన తన శిష్యులకు అంతములో ఎలా ఉంటుందో చెప్పాడు.

మత్తయి 24:37–39

**37. నోవహు దినములలో ఏలాగుండెనో మనుష్య కుమారుని రాకడయును ఆలాగే ఉండును.**

**38. జలప్రళయమునకు ముందటి దినములలో నోవహు ఓడలోనికి వెళ్ళిన దినము వరకు, వారు తినుచు త్రాగుచు పెండ్లి చేసుకొనుచు పెండ్లికిచ్చుచునుండి**

**39. జలప్రళయమువచ్చి అందరిని కొట్టుకొనిపోవు వరకు ఎరుగకపోయిరి. ఆలాగుననే మనుష్యకుమారుని రాకడ ఉండును.**

ప్రతిరోజు జరిగె కార్యక్రమాలు – తినడం, త్రాగడం, పెళ్ళి చేసుకోవటం అనే విషయాల గురించి యేసు ఎందుకు చెప్పాడు. మనుష్యులు జాగ్రత్తగా లేకపోతే ప్రమాదం జరుగుతుందని ప్రవచించాడు. 38వ వచనంలో **'వారు'** అంటె దేవదూతలు. వీరు మానవులను పెళ్ళిచేసుకుంటు సామాన్య జీవితం జీవించారు. దేవుని ఆజ్ఞలు మీరసాగారు. దేవుడు ఏర్పరచిన సరిహద్దులు చెరిపివేశారు. (ఆది 6:2) ఇటువంటి అసహజకార్యక్రమాలు జరుపుటకు క్రీస్తు రాకడ సమీపమని గ్రహించాలి. తను మొదటిసారి జలప్రళయం ద్వారా నాశనం చేసిన విషయం తెలిసికూడా ఈ పద్ధతి కొనసాగుటకు ఎందుకు అనుమతిస్తున్నాడు. ఎందుకంటే తిరుగుబాటు జనాంగం ఎవరికి తలవంచాక తమపై తాము మాత్రమే దేవుళ్ళుగా ఉండాలనుకుంటున్నారు. తమకు తాము రక్షించుకోగలము అనె పిచ్చి భ్రమలో కొనసాగేటట్లు దేవుడు వాళ్ళను వదిలివేశాడు. ఒక హేతువాద భావాలు కల పరిణామ క్రమ శాస్త్రవేత్త తాను దేవునిలో మారాలనుకుంటున్నట్లు బహిరంగ ప్రకటన చేశాడు. తాను మనిషిలోని జీవాన్ని రూపొందించుతానని దానిద్వారా చనిపోయిన తన తండ్రిని బ్రతికించటం తన లక్ష్యమని చాలా పొగరుగా ప్రకటించాడు.

ఇటువంటి భావాల వ్యక్తులు మోసం నుండి

పుట్టినవారు. ఆదాము, అవ్వలకు ఆశ చూపించిన సాతానుని పండు – దేవుళ్ళులాగా ఉంటారనినదే కదా? వారు అవ్వతో మీరు ఈ పండు తిను దినమున దేవతలవలె ఉంటారన్నాడు. ఇదే బూచి పండు – దేవుళ్ళు లాగా ఉంటారు అనే బూచి పండుతో నేడు కొన్ని వేలమంది వేరే గ్రహం నుండి వచ్చిన రక్షకుని మాటను నమ్ముతారు. వారు చేయవలసినది కేవలం ఆ ముద్రను ధరించడం. అలా చేసినపుడు దేవుళ్ళులాగ వేరొక ఆత్మీయ స్థితిని చేరుతారని నమ్మకం.

స్త్రీ, పురుషులను మరొక క్రొత్త లోకంలోకి తీసుకొని వెళ్తాను అనె వాగ్దానంతో ఈ లోకంలో తన ప్రస్థానం ప్రారంభించడానికి ఈ మోసపరచు రక్షకుడు రెక్కలు కట్టుకొని సిద్ధంగా ఉన్నాడు. వీడు అనుకూల సమయంలో ముందుకు వచ్చి నమ్మినవాళ్ళకు క్రీస్తుతత్వము ప్రసాదిస్తానని ప్రకటిస్తాడు. ఇశ్రాయేలీయులు 1948 సం॥లో తమ గుర్తింపు సాధించినప్పటి నుండి ఈ గ్రహాంతర జీవులు మోసపరచు అబద్ధికునికి అనుకూల మైన ప్రాథమిక చర్యలు ప్రారంభించాయి. వీరు రాస్‌వెల్, న్యూ మెక్సికోలో 1947లో ఎందుకు ప్రత్యక్షమయ్యారు. తమ ప్రస్థానం ఎందుకు ప్రారంభించారు? అమెరికా ప్రభుత్వం ఒక గొప్ప విషయాన్ని ఎందుకు దాచిపెట్టింది. ఇపుడు ఇశ్రాయేలు మరల దేశంగా ఉనికి ప్రారంభించింది. సాతానుకు లేఖనాలు బాగా తెలుసు. వాడు తన సమయం దగ్గరౌతుందని క్రీస్తు భూమిని స్వాధీనం చేసుకుంటాడని గ్రహించాడు.

**సాతాను మోసానికి డార్విన్ సిద్ధాంతం సిద్ధపరిచింది :**

19వ శతాబ్ధంలో డార్విన్ వెలుగులోకి తెచ్చిన జాన్ పరిణామ క్రమ సిద్ధాంతం మీద అంత్య దినములలో మోసగాడి అబద్ధం స్థిరమైన పునాది వేసింది. (2థెస్స 2:8–12). గడచిన దశాబ్ధ కాలంలో పరిణామక్రమ సిద్ధాంతం అనేది అసాధ్యమైన సిద్ధాంతం అని సైన్సు స్పష్టంచేసినప్పటికి, విద్యావంతులు జీవశాస్త్రజ్ఞానులు సైన్సు స్పష్టం చేసిన దానిని తృణీకరిస్తూ తమ ఆలోచనలలో ఈ సిద్ధాంతాన్ని గుడ్డిగా నమ్మి అనేకులను మోసం చేస్తున్నారు. తన సిద్ధాంతానికి ఏ తీవ్రమైన గుర్తింపు ఉండదని ఎందుకంటె ఈ సిద్ధాంత క్రమంలో ఇతర జీవరాశుల ఉనికి కనబడలేదని డార్విన్ తన నోటితోనే ఒప్పుకున్నాడు.

అయినప్పటికి డార్విన్ సిద్ధాంత వారసులకు మాత్రం ఇదో గుండెవంటి గొప్ప విద్యా సూత్రం. వారి నరనరాల్లో జీర్ణించుకుపోయింది. సృష్టిలోని ఆత్మీయ జీవాన్ని గుర్తించకుండా బాహ్య సంబంధమైన దృష్టిలోనికి ఇది మావనజాతిని నడిపించింది. బైబిల్ సిద్ధాంతం మొత్తాన్ని ఆత్మీయ విషయాలు సమీక్షిస్తాయి. దేవుడు ఆత్మ కనుక ఆయన బాహ్య సంబంధ విషయాలతో కాకుండా ఆత్మతోను, సత్యముతోను ఆరాధించాలని కోరుకుంటు న్నాడు. కాని హేతువాదులు దేవుని నమ్మరు. అధికులు లౌకికవాదులు, దేవుని భయం కలిగిన జనాంగం అని తలచే ఇశ్రాయేలీయులలో 90శాతం సైతం లౌకిక వాదులతో, హేతువాదులతో నింపబడింది. వారు వారి దేశంలో శాంతి కోరుకుంటు తమ హక్కైన భూమి వదులుకుంటున్నారు. అందువలన విద్యాలయాలు బాహ్య సంబంధమైనదిగా మారిపోయాయి.

విశ్వంలో ఇతర జీవుల ఉనికి ఋజువు పరచినట్లయితే మన వలెనె వారును జీవించువారని మనం అంగీకరిస్తాము. గ్రహాంతర జీవులు అనేది సాతాను రచించిన రచన. దీనితో మనుష్యులను సులువుగా మోసం చేస్తూ గ్రహాంతర జీవులకు దగ్గర చేస్తాడు. వీరు ఈ గ్రహాంతర జీవులు తమవంటి వారే అని నమ్ముతారు. కాని నిజానికి ఇది అబద్ధం. గ్రహాంతర జీవులు అంటె మన భూమిపైకి వస్తున్న దురాత్మల సమూహమే.

# నీ శత్రువుతో నీ దేవుడు యుద్ధము చేయును



**శ్రీమతి మాధురి మరియన్**

ప్రియమైన "పరిశుద్ధత" పాఠకులకు నా హృదయ పూర్వక వందనములు. బాగున్నారండీ! ప్రభువు మిమ్మును ఎల్లప్పుడు కాపాడాలని మీకోసం మేము ప్రార్థిస్తున్నాము.

నీ శత్రువుతో నీ దేవుడు యుద్ధము చేయును. ఈ మాట వినగానే మనకు చాలా ధైర్యంగా ఉంటుంది. ఎందుకంటే అన్ని విషయములలో శత్రువు మనకంటే బలంగా వుంటాడు. తెలివిగా ఉంటాడు. చాలాసార్లు మనపైన వాడు జయం పొందుతూ వుంటాడు. అయితే మనకు ఒక శుభవార్త. ఈ రోజు దేవుడు మనకు విడుదల చేస్తున్న వాక్యం ఏమిటంటే, నీ శత్రువుతో నీ దేవుడు యుద్ధము చేయును. మనలో వున్నవాడు మనకంటే గొప్పవాడు. మన శక్తి సామర్థ్యము కంటే ఉన్నతమైన వాడు. నీ శత్రువుతో పోరాడి నీకు జయమునివ్వగల సమర్థుడు.

2దినవృత్తాంతములు 20:12లో యెహోషాపాతు మంచి ప్రార్థన చేస్తాడు. మా దేవా, నీవు వారికి తీర్పు తీర్చవా మా మీదికి వచ్చు ఈ గొప్ప సైన్యముతో యుద్ధము చేయుటకు మాకు శక్తి చాలదు. ఏమి చేయుటకు మాకు తోచదు. నీవే మాకు దిక్కు అని ప్రార్థన చేసెను. ఒక్కరోజు ప్రార్థన ఎంత బలమైన కార్యము జరిగించిందో చూడండి. శత్రువు దండెత్తి వచ్చినప్పుడు వారి బలము చాల లేదు. వారి శక్తి చాల లేదు. యెహోషాపాతు చాలా భయపడి యెహోవా యొద్ద విచారించటకు మనసు నిలుపుకొని యూదాయంతటా ఉపవాస దినము చాటింపగా అందరూ కలసి బలమైన ప్రార్థన చేసిరి. మనవల్లగాని కార్యములు ఏవైనా సరే మనం దేవుని వైపు చూస్తూ ప్రార్థించాలి. అది కోర్టు కేసు అనుకోండి, దేవుడు శాసనములు మార్చ గలవాడు. అధికారుల హృదయములు త్రిప్పగలవాడు. నీ పక్షమున న్యాయముగా తీర్పు ఇచ్చును. ఎస్తేరు అలానే ప్రార్థించింది. తన శత్రువుతో ఆమె యుద్ధము చేయలేదు గాని దేవునికి మూడు దినములు ఉపవాసముండి ప్రార్థించింది. ప్రభువా నా పక్షముగా న్యాయము తీర్చవా నా శత్రువుపై నాకు జయమునియ్యవా అని దేవుని సన్నిధిలో మొఱ్ఱపెట్టింది. ఎస్తేరు శత్రువుతో దేవుడు యుద్ధము చేశాడు. గొప్ప విజయము వారికి దేవుడు దయచేశాడు.

అలాగే యెహోషాపాతు యూదులందరూ ఉపవాస ముండి ప్రార్థన చేయగా 2దినవృత్తాంతములు 20:15లో యెహోవా సెలవిచ్చినదేమనగా ఈ గొప్ప సైన్యమునకు మీరు భయపడకుడి జడియకుడి ఈ యుద్ధము మీరు కాదు దేవుడే జరిగించును. ఈ వాక్కు వారికి వచ్చిన వెంటనే వారు ఎంతో ధైర్యము తెచ్చు కున్నారు. విశ్వాస ముతో యుద్ధమునకు వెళ్ళారు. దేవుడు ఆశ్చర్యకరముగా వారికి జయము అనుగ్రహించాడు.

ఈలాగు యెహోవా వారి శత్రువుల మీద వారికి జయము అనుగ్రహించి వారిని సంతోషపరచెను. ఆమెన్! ఎంత గొప్ప కార్యము చూడండి. నా ప్రియ సహోదరి సహోదరులారా నీ దేవుడు నీ శత్రువుతో యుద్ధము చేయును. నీ సమస్య ఎటువంటిదైనా ఒక రోగముతో నీవు చాలాకాలం నుండి బాధపడుతున్నావేమో ఇక్కడే ఉపవాసముండి ప్రార్థించు. ప్రభువా ఈ బాధ నేను పడలేను నాకు విడుదల కావాలి, శత్రువులా రోగం నన్ను వేధిస్తుంది.

నన్ను రక్షించు తండ్రి అని ప్రార్థించు. తప్పకుండా అనారోగ్యం నుండి నిన్ను దేవుడు విడిపిస్తాడు. చదువులో ఎన్నిసార్లు వ్రాసినా విజయం రావటం లేదా ప్రార్థించు, నీ దేవుడు నీ చదువులలో విజయం ఇస్తాడు. ఉద్యోగ ప్రయత్నాలలో సహాయం చేస్తాడు. అప్పుల ఊబిలో నుండి రక్షిస్తాడు. నీ శత్రువుల అందరిపై నీకు జయమును అనుగ్రహిస్తాడు.

ముఖ్యమైనది ఏమిటంటే బలమైన సమస్యకు బలమైన ప్రార్థన అవసరం. నీ ప్రార్థన ఎంత బలముగా వుంటుందో నీకు అంత గొప్ప విజయం దయచేస్తాడు.

నెహెమ్యా ప్రార్థన చూద్దాము. నెహెమ్యా 1:4. ఈ మాటలు వినినప్పుడు నేను కూర్చుండి యేడ్చి కొన్ని దినములు దుఃఖముతో ఉపవాసముండి ఆకాశమందలి దేవుని యెదుట విజ్ఞాపన చేసితిని. నీకు విరోధముగా పాపము చేసిన ఇశ్రాయేలీయుల కుమారుల దోషమును నేను ఒప్పుకొనుచున్నాను. నేనును నా తండ్రి యింటి వారును పాపము చేసియున్నాము అని తన్ను తాను తగ్గించుకొని దేవుని సన్నిధిలో ఉపవాసముండి దుఃఖముతో ప్రార్థన చేయగా దేవుడు నెహెమ్యాకు గొప్ప సహాయం చేశాడు. మనుషులను సమకూర్చాడు. తనకు కావలసిన వాటినన్నిటిని దయచేశాడు. 4:14లో నెహెమ్యా "వారికి మీరు భయపడకుడి మహాఘనుడును భయంకరుడునగు యెహోవాను జ్ఞాపకము చేసికొని మీ నివాసము మీకుండునట్లు యుద్ధము చేయుడి అని అంటిని ఇలా తలపెట్టిన కార్యములలో ఎన్నో ఆటంకములు ఎదురైనా దేవుడు వారికి సహాయం చేశాడు. శత్రువుపై విజయం ఇచ్చాడు. 6:15లో అన్యులు, దేవుడు చేసిన అద్భుతములు చూసి దేవునికి భయపడిరి. మన శత్రువుతో యుద్ధము చేయువాడు మన దేవుడు. ఈ పని దేవుని వలన జరిగిన దని వారు తెలుసుకొనిరి. దేవునికి స్తోత్రములు! దేవుడు మనలను దీవించును గాక!

**....21వ పేజి తరువాయిభాగం**


మరికొన్ని మహిమలను గురించినవి. "ఆ దినమున యెరూషలేము యెదుట తూర్పుతట్టున ఉన్న ఒలీవల కొండమీద ఆయన పాదములనుంచగా ఒలీవల కొండ తూర్పుతట్టుకును సగము కొండ దక్షిణపు తట్టుకును జరుగును కనుక విశాలమైన లోయ యొకటి యేర్పడును" (జెకర్యా 14:4). ఇంకా జెకర్యా 14:3లో ఉన్నట్లు అన్నీ దేశాలు తమ సైన్యాలతో యెరూషలేముపై దండెత్తుతాయి.

మన ప్రభువు వచ్చినపుడు తానే ఈ సైన్యాలతో యుద్ధము చేయును. దేవాలయం నాశనము కాబోదు కాని యూదులు మహా శ్రమలనుభవించెదరు. శ్రమకాలము తరువాత అది మహిమపరచబడును. అప్పుడు అది ప్రభువు పట్టణమగును. ఇశ్రాయేలు వారు దేవుని వైపు మళ్ళు వరకు యెరూషలేము మహిమపరచబడదు. ఆయనను సిలువ వేయుము అని ఘోషించిన ఆ పట్టణము పునరుత్థానుడైన యేసు తిరిగి రావడం చూచి ఆశ్చర్యపడును. అప్పుడే "సమాధాన పట్టణము" అను పేరును సంతరించుకొనును. ఆమెన్!!


## పాఠకులకు శుభవార్త

**'పరిశుద్ధత'** మాసపత్రిక గత నెల నుండి ఇంటర్నెట్‌లో చదువుకొనే సౌకర్యము కల్పించామని తెలియజేయుటకు సంతోషిస్తున్నాము. వెబ్‌సైట్ పేరు **www.holinessmagazine.com.** ప్రస్తుతము మీరు 2014 సంచికలన్నీ డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును. త్వరలో పాత సంచికలన్నీ ఇంటర్నెట్ నుండి డౌన్‌లోడ్ చేసుకొనే సౌకర్యం కల్పించటానికి ప్రయత్నిస్తాము. కావున విదేశాలలో ఉన్న మీ బంధువులకు,

# సాతాను చేతిలో సాంకేతిక పరిజ్ఞానం


బ్రదర్ కె. సామ్రాట్

పూర్వపు రోజుల్లో కలలో కూడా ఊహించలేని సాంకేతిక వస్తువులు, పరికరాలు ఇప్పుడు నిజజీవితంలో ఆవిష్కరించబడుతున్నాయి. గతంలో ధనికులు మాత్రమే అనువైనవి, ఇప్పుడు సామాన్యులకు కూడా లభ్యమవుతున్నాయి. కంప్యూటర్స్, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, వైద్య, పరిశ్రమ, రణావా, విహారం, ఆహారం, విద్యా, వాణిజ్యం ఒకటేమిటి అన్నీ రంగాలలో సాంకేతిక నైపుణ్యం అధునాతన మార్గాల్లో శరవేగంతో దూసుకుపోతుంది. గత శతాబ్ది మొత్తంలో జరుగని సాంకేతికాభివృద్ధి గత దశాబ్దిలో జరిగిందనుట అతిశయోక్తి కాదు. ప్రపంచీకరణ పుణ్యమా అని ఈ సాంకేతికాభివృద్ధి భూమి నాలుగు దిక్కులలో రోజురోజుకీ విస్తరిస్తుంది.

సాంకేతికతవల్ల అనేక లాభాలు సమాజానికి చేకూరాయి. గత దినాల్లో వేలమంది చేసే పని నేడు పుదుల సంఖ్యలో కార్మికుల చేయగలుగుతున్నారు. పారిశ్రామిక విప్లవము వలన కలిగిన ఫలితాలు అన్నీ వస్తువుల ధరలను తగ్గు ముఖం పట్టించటమే కాకుండా సౌలభ్యానికి, సౌకర్యానికి అనువుగా మారాయి. దురదృష్టవశాత్తు, సాంకేతిక పరిజ్ఞానము, అత్యాధునికి వ్యవస్థలే ప్రభువైన క్రీస్తు విరోధి ప్రత్యక్షమైనప్పుడు అతడు తన దుష్టకార్యకలాపాలను విస్తరించే ప్రక్రియలలో భాగస్వాములుగా మారతాయి.

అంత్యదినాల్లో "చాలామంది నలుదిశల సంచరించి నందున తెలివి అధికమగును" అని దానియేలు ప్రవక్త ప్రవచించాడు. ఆ మాటలు మనకాలంలో నెరవేరాయి. రవాణా వ్యవస్థలో కలిగిన విప్లవాత్మకమైన మార్పుల వల్ల లక్షలమంది ప్రజలు భూమి నలుదిశలా సంచరించుచున్నారు. స్వాతంత్ర్యానికి ముందు గాంధీగారు లండన్ వెళ్ళడానికి మూడు నెలలు పడితే నేడు మనము కేవలం ఏడు గంటల్లో ఆ ప్రయాణం చేయగలుగుచున్నాము. జపాన్‌లోని బుల్లెట్ రైలు వేగం గంటకు 300 కి.మీ పైమాటే. అంతరిక్షములోకి వెళ్ళే అంతరిక్ష నౌకలు గంటకు 30,000 కి.మీ. వేగంతో ప్రయాణిస్తున్నాయి.

అంత్యదినాల్లో తెలివి కూడా అధికమౌతుంది. క్రీస్తు విరోధి కూడా ఎంతో కపటంతో కూడిన తెలివిగలవాడై యుండును. ఆ తెలివి మీరి అతని నోరు గర్వముతో మాట్లాడును (దానియేలు 7:20). ఇచ్చకపు మాటలచేత రాజ్యములను సహితం అపహరించే రాజకీయ ప్రయుక్తులు అతని సొంతం (దానియేలు 11:21). ప్రపంచీకరణను క్రీస్తువిరోధి తన వ్యాపార అంగడిగా మార్చుకుంటాడు. "మరియు నతడు ఉపాయము కలిగివాడై మోసముచేసి తనకు లాభము తెచ్చుకొనును" (దానియేలు 8:25). క్రీస్తువిరోధి అంబులపొదిలో అత్యాధునికి మిలటరీ టెక్నాలజీ కూడా ఉంటుంది. దానిని ఉపయోగించి అతడు, "ఆశ్చర్యముగా శత్రువులను నాశనము చేయుటయందు అభివృద్ధి పొందును" (దానియేలు 8:24).

### సర్వం కంపూటర్ల మయం

నేటి సమాజంలో కోట్లకొలది కంపూటర్లు వినియోగములోకి వచ్చి అన్ని రంగాలను అనుసంధానములోకి తెచ్చాయి. ఆఖరికి ఐపాడ్‌లాంటి సంగీత పరికరాల్లోకి కూడా కంప్యూటర్ పరిజ్ఞానము చొరబడింది. ఇంటర్నెట్ వలన ప్రపంచములోని కంపూటర్లలన్నీ ఒకే తాటిమీకు వచ్చాయి. గూగుల్, ఎర్తలింగ్ లాంటి సంస్థలు తమ వై-ఫై టెక్నాలజీతో ఏకంగా శాన్‌ఫ్రాన్సిస్కో నగరం మొత్తాన్ని వైర్‌లెస్ కంప్యూటరుగా మార్చే ప్రయత్నాల్లో ఉన్నాయి. మైక్రోసాఫ్ట్ అధిపతి బిల్‌గేట్స్ ఇటీవల ఒక ఎలక్ట్రానిక్ సదస్సులో ప్రసంగిస్తూ, ప్రపంచములోని ప్రతి మనుష్యుని జీవితంలో తన సంస్థ యొక్క విండోస్ పరిజ్ఞానము కీలక పాత్ర వహించేటట్లు చేస్తానని ప్రతినపూనాడు. శరవేగంతో

అభివృద్ధి చెందుతున్న ఈ సాంకేతిక వ్యవస్థ పరిపక్వమైన పండులా క్రీస్తువిరోధి చేతిలో పడుతుంది. దీని సహాయంతో అతడు ప్రతి ప్రజమీదను, ఆయా భాషలు మాట్లాడు వారి మీదను అధికారము చెలాయిస్తాడు (ప్రకటన 13:7).

## క్రీస్తు విరోధి సంఖ్య

క్రీస్తువిరోధి యొక్క సంఖ్య 666. "ఇందులో జ్ఞానము కలదు" అని ప్రకటన 13:18 తెలియజేయుచున్నది. ఈ సంఖ్యను ప్రతి వ్యక్తి తన కుడిచేతిమీదగాని, లేదా నొసటి మీదగాని ముద్రించుకుంటే తప్ప క్రీస్తువిరోధి సామ్రాజ్యంలో మనుగడ సాగించలేరు. ఒకసారి టెక్నాలజీ రంగం లోకి చూస్తే ఒళ్ళు గగుర్పొడిచే వాస్తవాలు బయట పడతాయి. బియ్యంగింజ పరిమాణంలో ఉండి అరచేతిలో చర్మము క్రింద అమరే కంప్యూటర్ చిప్‌లు ఇప్పటికే వినియోగంలోకి వచ్చాయి. వెరిచిప్ లాంటి సంస్థలు మానవ శరీరాల్లో అమరే కంపూటర్ చిప్‌లను కోట్ల సంఖ్యలో ఉత్పత్తి చేయటం ప్రారంభించింది. ఒక వ్యక్తికి సంబంధించిన సమాచారం మొత్తం (అతని బ్యాంకు వివరాలు, పుట్టుపూర్వోత్తరాలు, ఆరోగ్య సమాచారం) ఈ కంప్యూటర్ చిప్‌లో నిక్షిప్తమై ఉంటుంది. అంతేకాకుండా, రహస్య ద్వారాలు తెరవటానికి, వ్యాపార లావాదేవీలు నిర్వహించటానికి ఈ అరచేతిలోని కంప్యూటర్ చిప్‌ను వాడవచ్చు. క్రీస్తువిరోధి పాలనలో ప్రతి మనుష్యుడు ఈ కంప్యూటర్ చిప్‌ను ధరిస్తాడు. 666 నెంబరు ఎవరి మీదనైతే ఉండదో వారి జీవితం దుర్లభం కావటం మాత్రమే కాక వారి చావు ఖాయం.

అమెరికాలోని వాషింగ్టన్ యూనివర్సిటీకి చెందిన కంప్యూటర్ నిపుణుడైన మార్క్ పిడినోస్కీ ఆర్.ఎఫ్.ఐ.డి. చిప్‌లాగా పనిచేసే సిరాను కనిపెట్టాడు. ఈ సిరాతో వేసిన ముద్ర శరీరముపై నిలిచిపోయి ఆ ముద్ర కలిగిన వ్యక్తి భూమిపై ఎక్కడ ఉన్నా క్షణాల్లో తెలియజేస్తుంది. ప్రస్తుతం ఈ సిరా ముద్రను అమెరికాలో క్షీరదాల ఉనికిని తెలిసి కొనుటకు వినియోగిస్తున్నారు. భవిష్యత్తులో దీనిని మానవుల ఉనికి తెలుసుకొనుటకు వాడవచ్చు.

క్రీస్తువిరోధి నియంతృత్వ వ్యవస్థకు దోహదపడే మరో పరిజ్ఞానం జి.పి.యస్. టెక్నాలజి. శాటిలైట్ సహాయంతో పనిచేసే ఈ పరిజ్ఞానం ఒక వ్యక్తి ఏ సమయంలో ఎక్కడ ఉన్నాడో తెలియజేస్తుంది. ప్రపంచ వన్యమృగ సంస్థ ఇప్పటికే బోర్నియోలాంటి ద్వీపాలలో అంతరించిపోతున్న పిగ్మీ ఏనుగల స్థితిగతులను పసిగట్టేందుకు ఈ జి.పి.యస్. టెక్నాలజీని వినియోగిస్తుంది. అమెరికా దేశంలో స్ప్రింట్ లాంటి టెలిఫోన్ సంస్థలు తల్లిదండ్రులు తమ పిల్లలు ఏయే వేళల్లో ఎక్కడెక్కడ ఉన్నారో తెలుసుకొనేందుకు ఈ జి.పి.యస్. టెక్నాలజీని ఉపయోగిస్తున్నాయి. పిల్లవాడు చేతిమీద ఉండే సెన్సారు పరికరం శాటిలైట్‌ల సహాయంతో ఆ పిల్లవాడు ఎక్కడ ఉన్నాడో తల్లిదండ్రులకు సమాచారం అందిస్తుంది. రోమ్ నగరంలో కూర్చుని క్రీస్తువిరోధి ఈ జి.పి.యస్. టెక్నాలజీ సహాయంతో ప్రతి మనుష్యుని కదలికలను నియంత్రిస్తాడు.

సాతాను యొక్క మానవ రూపమైన క్రీసువిరోధి తన శత్రువుల ఆలోచనలను కూడా ఇట్టే పసిగడతాడు. మనుష్యుని ఆలోచనలతో నియంత్రించబడే కంప్యూటర్‌లు ఇప్పటికే అందుబాటులో ఉన్నాయి. జర్మనీకీ చెందిన బి.బి.సి.ఐ. సంస్థ ఇప్పటికే ఆలోచనలతో నియంత్రించబడే కంప్యూటర్‌లను వినియోగదారులకు అందుబాటులోకి తెచ్చింది. ఇటీవల రూపొందించబడిన పరిజ్ఞానాలైలు నానో టెక్నాలజీ మరియు సైబర్నటిక్స్. మానవ స్వభావాన్ని సహితం మార్చివేయగల శక్తి ఈ పరిజ్ఞానాలకు ఉంది. క్రీస్తువిరోధి ప్రజల నైతిక జ్ఞానాన్ని రూపుమార్చే ప్రక్రియలో నానో టెక్నాలజీని వినియోగించవచ్చు.

కమ్యూనికేషన్ల రంగాన్ని కూడా క్రీస్తువిరోధి శాసిస్తాడు. ప్రజలు టెలిఫోన్లలో, ఇ-మెయిల్ ద్వారా, టెక్స్ట్ మెసేజీల ద్వారా ఏమేమి సంభాషిస్తారో అది క్రీస్తువిరోధి వినికిడిలో ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే అనేక ప్రభుత్వాలు తమ ప్రజల సంభాషణలను రహస్యంగా వినటం మామూలైపోయింది. సెప్టెంబర్ 11 దాడుల తరువాత అమెరికా ప్రభుత్వం ఎ.టి. అండ్ టి. లాంటి టెలిఫోను సంస్థలను ఉపయోగించి తమ దేశములోని ప్రజలు దేశము వెలుపల, బయట వ్యక్తులతో చేసే సంభాషణపై నిఘా వేయటం ఒక ఉదాహరణ. క్రీస్తువిరోధి పాలనలో ఇలాంటి నిఘా అన్ని దేశాలకూ వ్యాపిస్తుంది.

ఇంటర్నెట్ వ్యాప్తి వలన యాహూ, హాట్‌మెయిల్, మైస్పేస్ తదితర సంస్థలు ఛాటింగ్‌ను విస్తృతపరచి, ప్రపంచ దేశాల ప్రజల మధ్య పొలిమేరలు చెరిపివేశాయి. ఇలాంటి టెక్నాలజీ వలన ప్రపంచమంతా ఒకే సమాజంలా మారి భూమి ఒక కుగ్రామంలా రూపొందింది. సెల్ ఫోనులు, టి.వి.లలో ప్రత్యక్ష ప్రసారాల ద్వారా ప్రపంచంలో ఏ మూల జరిగిన సంఘటననైనా క్షణాల్లో అందరూ తెలుసు కొనటం నేడు మనకందరికీ అలవాటైపోయింది. క్రీస్తువిరోధి పాలనలో కూడా ఈ జీవన విధానం కొనసాగుతుంది.

మహా శ్రమల కాలములో ఇద్దరు సాక్షులు 1260 రోజులపాటు నానా విధములైన తెగుళ్ళతో భూనివాసులను ప్రత్యక్షనరకయాతనకు గురిచేస్తారు (ప్రకటన 11:8). ఈ ఇద్దరు ప్రవక్తలచేత బాధింపబడిన భూనివాసులు వీరి మరణవార్త విని సంబరపడతారు. మూడున్నర రోజుల పాటు ఇద్దరు ప్రవక్తలు పార్థివ దేహాలు యెరూషలేము వీధులలో పడియుండుట ప్రపంచ వ్యాప్తముగా టి.వి.లలో ప్రత్యక్ష ప్రాసరాల్లో చూచి వీరు ఆనందిస్తారు (ప్రకటన 11:10,11).

సాంకేతిక రంగంలో వచ్చిన మార్పులు ప్రపంచీ కరణకు ఎంతో దోహద పడ్డాయి. నేడు కోకొల్లలుగా స్టాక్‌లు, పెట్టుబడులు తదితర వ్యాపార లావాదేవీలు ఇంటర్నెట్ మీద దేశాంతరాలకు వ్యాప్తి చెందాయి. అనేక వ్యాపార సంస్థలు ఇతర దేశాల్లో వాణిజ్య కలాపాలు ప్రారంభించాయి. అమెరికాలోని సంస్థలకు కావాల్సిన సాఫ్ట్‌వేర్ నైపుణ్యం బెంగుళూరులాంటి నగరాల నుండి లభ్యమవుతుంది. చైనా వస్తువులు ఇప్పుడు అనేక దేశాల మార్కెట్‌లను ముంచెత్తుతున్నాయి. అమెరికాలోని ప్రజల ప్రశ్నలకు ఇప్పుడు హైదరాబాదు కాల్ సెంటర్‌లలో కూర్చుని భారతీయులు సమాధానాలు ఇస్తున్నారు.

ఇండియాలోని వైద్యశాలల్లో ఉన్న రోగుల ఎక్స్‌రేలను ఇంగ్లాండులోని వైద్యులు చదివి ఏయే చికిత్సలు చేయాలో నిర్ధారిస్తున్నారు. జపాన్, తైవాన్, కొరియాలాంటి దేశాలు తమ పారిశ్రామిక కేంద్రాలను ఏకంగా చైనాకు తరలించాయి. వ్యాపారంలో వచ్చిన గణనీయ మార్పులు ఇప్పుడు దేశ సరిహద్దులను చెరిపివేస్తున్నాయి. ఒక దేశము యొక్క ఆర్థిక వ్యవస్థ మరో దేశము యొక్క ఆర్థిక వ్యవస్థపై ఆధారపడి మనుగడ సాగించటం ఆనవాయితీ అయి పోయింది. యఫ్.డి.సి. లాంటి సంస్థలు ప్రపంచ వ్యాప్తంగా కోటానుకోట్లమంది ప్రజల క్రెడిట్ కార్డులను నియంత్రిస్తు న్నాయి. ప్రపంచీకరణ వలన వచ్చిన ఈ మార్పులను క్రీస్తువిరోధి తన పాదాక్రాంతం చేసుకుంటాడు. ప్రపంచ వ్యాపార రంగాన్ని క్రీస్తువిరోధి పూర్తిగా నియంత్రిస్తాడు. “కాగా కొద్దివారుగాని, గొప్పవారుగాని, ధనికులుగాని, దరిద్రులుగాని, స్వతంత్రులుగాని, దాసులుగాని అందరును తమ కుడిచేతిమీదనైనను తమ నొసటియందైనను ముద్రవేయించుకొనునట్లును, ఆ ముద్ర అనగా ఆ మృగము పేరైనను దాని పేరిట సంఖ్యయైనను కలవాడు తప్ప, క్రయవిక్రయములు చేయుటకు మరి ఎవనికిని అధికారము లేకుండునట్లును అది వారిని బలవంతము చేయుచున్నది” (ప్రకటన 13:16,17).

## ప్రకటన

**క్రైస్తవ కథలు, వ్యాసాలు, రచనలు, కవితలు, పాటలు మొదలగునవి మా ప్రియ పాఠకుల నుండి కోరడమైనది. ఆసక్తిగలవారు తమ తమ భావాలను మా పత్రిక ద్వారా పాఠకులకు అందించవచ్చు. ఉత్తమ కథకు ప్రతినెల రూ. 58/- ల నగదు బహుమానం వుంటుంది. క్రైస్తవ కథ ఏదైనా 2 పేజీలకు మించకూడదు.**

# మానవుడు



శ్రీమతి కమలా సామ్రాట్

మానవుడు దేవుని సృష్టి యొక్క కిరీటము. విశ్వములో నక్షత్రాలకంటే గొప్పది మరియు ఎంతో అద్భుతమైనది మానవునికి మానవుని గూర్చిన అద్భుతమే. అన్నిటికంటే మొదటిగా మన శరీరమువైపు చూచుకున్నట్లయితే దేవుడు ఎంత అద్భుతంగా దానిని సృష్టించాడో చూడవచ్చును.

మన కంటిలో 13 కోట్ల చిన్న చువ్వలవంటివి నలుపు తెలుపు దృష్టికోసం, మరియు 70 లక్షల కోణాలవంటివి రంగుల దృష్టికోసం ఉంచబడినవి. మరియు 15 లక్షల సందేశాలను ఒకేమారు అందుకోగలవు. ఈవిధంగా ఒక కన్ను పనిచేసిన తీరులో యంత్రాలను పనిచేయాలంటే మనకు రెండు లక్షల యాభైవేల టెలివిజన్ ట్రాన్స్‌మీటర్లు (ప్రసారం చేసేవి) రిసీవర్లు (ప్రసారాలు అందుకొనేవి) కావాలి. అలాగే చెవి గురించి చూచినట్లయితే, శ్రవణేంద్రియ సంబంధమైన నరము కేవలము 3/4 అంగుళం పొడవు మరియు పెన్సిల్‌లో ఉండే నల్లగా వ్రాసే పదార్థమంత వ్యాసంతో ఉంటుంది. అయితే దానిలో 30 వేల విద్యుత్‌కు సంబంధిం చిన సర్క్యూట్స్ ఇమిడి ఉంటాయి. పియానో వాయిద్యము వాయించే మీటల బల్లకు 88 మీటలు మాత్రమే ఉంటాయి. అయితే మన లోపలి చెవిలో మీటల బల్లకు సుమారు 1100 మీటలు ఒకే దూరపు ఫ్రీక్వెన్సీ కలిగి ఉంటాయి. అది బహు సున్నితమైనది. ఒక పియానో వాయించినపుడు ఏ రెండు మీటలు నొక్కినా వెలువడే 12 వేరు వేరు స్వరాలను అది అందుకోగలదు.

అలాగే మన గుండె గురించి చూచినట్లయితే, అది ఒక సంవత్సరానికి సుమారు 4 కోట్లసార్లు కొట్టుకుంటుంది. అది ప్రతిరోజు తల నుండి పాదాల వరకు లక్ష కిలోమీట్ల రక్తనాళాల ద్వారా రక్తాన్ని ప్రవహింపచేస్తూ ఉంటుంది. శరీరం కూడా ప్రతిరోజూ 172 కోట్ల ఎర్ర రక్త కణాలను తయారుచేసి పాడైన లేక పనికిరాకుండా పోయిన కణాల స్థానాలను భర్తీ చేస్తూ ఉంటుంది. ఈ రోజున నీవు బ్రతికి ఉండటం ఒక అద్భుతం కదా!

వినాళ గ్రంధులు గురించి చూద్దాం. మన శరీరంలో ఉన్న థైరాయిడ్ అనే వినాళ గ్రంథికి రోజుకు 1/5000 గ్రాము అయోడిన్ అనే పదార్థము కావాలి. అయితే అంత సూక్ష్మమైనట్టి పదార్థము నీవు పసిపాపగా ఉన్నప్పుడు తక్కువైనట్లయితే నీవు తప్పనిసరిగా మానసిక రుగ్మత కలిగి ఉంటాము. పిట్యూటరీ అనే వినాళ గ్రంథి మరియెంతో విచిత్రమైనది. దానినుండి వెలువడే హార్మోన్లు ఒక గ్రాములో పది లక్షోవంతు మాత్రం బరువు తూగుతుంది. అయినను మనం ఎదుగుతున్న సంవత్సరాలలో ఆ హార్మోను విడుదలలో ఏ మాత్రం హెచ్చుతగ్గులు ఉన్నా నీవు మానసికంగా మరియు శారీరకంగా అసాధారణంగా ఉండి ఉండేవాళ్ళం. ఈ దినాన మనం ఆరోగ్యంగా ఉన్నామంటే దానికి కారణం మన శరీరంలో ఉన్న ఎంతో చిక్కుతో కూడిన యాంత్రిక పనితనమంతా సరిగా పనిచేస్తున్నందునే.

బైబిలులో ఏమి వ్రాయబడివుందంటే “నన్ను అద్భుతంగా సృష్టించినందుకు ఓ దేవా! నిన్ను స్తుతిస్తున్నాను” మానవ శరీరంలో దేవుడు సృష్టించిన సమతూకము మరియు అందము నిజంగా విస్మయంతో కూడుకొన్నది.

మానవ శరీరంలో ఉన్న కొన్ని ఇటువంటి అద్భుతాలు జంతువుల శరీరాలలో కూడా ఉన్నాయి. కాని మానవునికి అతనిలో జీవాత్మ ఉంటుంది. అది అతనిని ఆలోచింప చేస్తుంది. మానవుడు తన ఆలోచనలను వ్రాసియుండి తనకున్న తెలివిని భవిష్యత్తు తరము వారికి అందించగలదు.

ఈ విధంగా జంతువులు చేయలేవు. మానవుని బుద్ధి దేవుని యొక్క మహోన్నత జ్ఞానంలో ఒక భాగం అయివున్నది.

కాని మానవునికి తన యొక్క జీవాత్మ కంటే లోతైన మరియెక్కువ ఆశ్చర్యకరమైనది ఇంకొకటి వుంది. అది ఆత్మ. ఇది నిజంగా మనలను సృష్టి అంతటికంటె పైన ఉంచుతుంది. ఈ ఆత్మ మన ఉనికి అంతటిలో లోతైనది మరియు అది దేవుడు ఉన్నాడనియు ఒక అత్యున్నతమైన శక్తికి మనము నైతికంగా లెక్క అప్ప చెప్పాలనియు మనకు చెబుతుంది.

దేవుడున్నాడని మనకు బోధించేది మనకున్న నాగరికత కాని, విద్య కాని కాదు. అలాగే మతం కూడా కాదు. అనాగరీకులైన అడవులలో ఉండే మనుష్యులను నీవు సందర్శించినట్లయితే అటువంటి క్రూరుల మధ్య కూడా దేవుని గూర్చి ఆలోచనలు నీవు చూడగలవు. వారు ఒక వస్తువునో లేక మరొక దానినో పూజిస్తారు. ఎందుచేతనంటే వారిలో ఉండే ఆత్మ ఒక మహోన్నతమైన శక్తికి వారు లెక్క అప్పచెప్పవలసి ఉంటుందని చెబుతుంటుంది. ఏ ఒక్క జంతువుకు కూడ లెక్క అప్ప చెప్పాలనే ఆత్మీయపు ఆలోచన సహజంగా ఉండదు. కేవలము మానవుడు మాత్రమే అపరాధ భావమునకు లోనవుతాడు. ఎందుకనగా అతనికి మాత్రమే మనస్సాక్షి ఉంటుంది. అందుచేతనే నీవు భక్తిగల కోతినిగాని, లేక ఆత్మ సంబంధి అయిన కుక్కనుగాని ఎప్పుడూ చూడలేవు.

మానవుడు భూమిపై తాను జీవించిన తర్వాత ఉన్న జీవితం (పరలోకము) కొరకు సృష్టించబడ్డాడు. మానవుడు నిత్యత్వము జీవించుట కొరకు సృష్టించబడ్డాడు. పరిణామ సిద్ధాంత వాదులు మానవులకు, జంతువులకు ఏ బేధము లేదనవచ్చు. అయినప్పటికి ప్రతి దేశములో పసిపాపను చంపడం, ఒక పెద్ద ఏనుగును చంపుట కంటే ఎంతో పెద్దదైన నేరం. ఒక ఏనుగు ఎంతో పెద్దదైయుండవచ్చు. కాని ఒక చిన్న పసిపాప ఎంతో విలువైనది. ఎందుచేతనంటే ఆ పాప దేవుని రూపంలో సృష్టింపబడినది. మానవుడు దేవుని సృష్టి అంతటికి కిరీటమైయున్నాడు. అతడు దేవునితో సహవాసం చెయ్యటానికి సృష్టించబడ్డాడు.

## బైబిల్ క్విజ్ - 1 జవాబులు

1. భూమ్యాకాశములను
2. 1. వెలుగును, 2. ఆకాశమును, 3. ఆరిననేల, సముద్రములు, గడ్డివిత్తనములిచ్చే చెట్లను, 4. సూర్యుడు, చంద్రుడు, నక్షత్రములను, 5. పక్షులు, చేపలు, 6. అడవి జంతువులు, పశువులు, ప్రాకు పురుగులను, నరులను, 7. తను చేసిన పని అంతటి నుండి విశ్రమించెను.
3. నేలమంటితో
4. ఆదాము ప్రక్కటెముకతో
5. మీరు ఫలించి అభివృద్ధిచెంది భూమిని నింపండి
6. ఆదాము
7. 4 శాఖలు, పీషోను, గీహోను, హిద్దెకెలు, యూఫ్రటీసు
8. మంచిచెడ్డల తెలివినిచ్చే చెట్టు
9. నిశ్చయముగా చనిపోవుదురు
10. సర్పము
11. నీవు శపించబడినదానవై నీ కడుపుతో ప్రాకుచు నీవు బ్రదుకు దినములన్నియు మన్ను తిందువు.
12. ప్రయాసమును నీ గర్భవేదనను నేను మిక్కిలి హెచ్చించెదను; వేదనతో పిల్లలను కందువు;
13. నీ నిమిత్తము నేల శపింపబడియున్నది; ప్రయాసము తోనే నీవు బ్రదుకు దినములన్నియు దాని పంట తిందువు;
14. కెరూబులను
15. కయీను
16. హేబేలు
17. భూమిని సేద్యపరచువాడు
18 గొఱ్ఱెల కాపరి
19. పొలము పంటలో కొంత
20. తన మందలో తొలుచూలున పుట్టిన వాటిలో క్రొవ్విన వాటిని
21. చంపివేసెను
22. నా తమ్మునికి నేను కావలివాడనా?
23. నేలను సేద్యపరచునప్పుడు అది తన సారమును ఇకమీదట నీకియ్యదు; నీవు భూమిమీద దిగులు పడుచు దేశదిమ్మరివై యుందువనెను
24. నోదు
25. హనోకు

# యెరూషలేము చరిత్ర



డా. విక్రాంత్ కొడవటికంటి

ప్రియ పరిశుద్ధత పాఠకులకు క్రీస్తు నామములో శుభాభి వందనములు. ప్రతిరోజు బైబిల్ చదవండి.

**యెరూషలేము చరిత్ర తెలుసుకుందాము**

“యెరూషలేము” అను పేరుకు ప్రశాంత నగరము లేక సమాధన పట్టణము అని భావము. కాని దాని చరిత్ర ప్రశాంతతకు సమాధానానికి చాలా దూరములోనే ఉన్నది. ముఖ్య ఘట్టములు.

ప్రప్రథమముగా ఇది షాలేము అను పేరుతో ఆదికాండము 14:18లో కనబడును. మెల్కిసెదెకు షాలేముకు రాజుగా ఉండెడివాడు. ఆయన సర్వోన్నతుడైన దేవుని యాజకుడు. యెరూషలేము పాలస్తీనా యొక్క ముఖ్య పట్టణము. దావీదు యెబూసీయులను ఓడించి యెరూష లేమును రాజధాని నగరముగా చేసికొనెను. యెబూసు అను పేరు కూడ ఈ పట్టణానికి ఉండెను (న్యాయాధిపతులు 19:10). అక్రా, జెజెతా, సీయోను, ఓఫెలు కొండలపై మొత్తము యెరూషలేను నగరమంతా నిర్మించబడినది.

800 సార్లు యెరూషలేము అను పేరుతోను, 150సార్లు సీయోను అను పేరుతోను, మొత్తం ఈ పట్టణం పాతనిబంధన గ్రంథములో సుమారు 1000 సార్లు పేర్కొనబడినది. దేవుని పట్టణము (కీర్తనలు 87:3), మహారాజు పట్టణము (మలాకీ 5:34) పరిశుద్ధ పట్టణము (నెహెమ్యా 11:1) అను పేర్లు కూడా కలవు.

దేవుని పరలోక పట్టణానికి సూచనగా యెరూషలేము పట్టణము ఉదహరింపబడినది (హెబ్రీ. 12:22). దేవునికి కూడ ఈ పట్టణము మీద ప్రత్యేకమైన ప్రేమ ఉన్నది (కీర్తనలు 78:68). ఈ పట్టణమునే తన నివాస స్థలముగా దేవుడు ఎన్నుకున్నాడు (ఆది. 22:2). ప్రపంచ ప్రజల పాపాల ప్రాయశ్చిత్తార్థమై క్రీస్తు రక్షకుడు మరణించుటకు వచ్చినది ఈ పట్టణమునకే.

ఈ ప్రాకార నగరము దావీదు రాజు క్రీ.శ. 1000 సంవత్సరాలకు పూర్వము కట్టించాడు. క్రీ.శ. 70వ సంవత్సరము టైటస్ దీనిని నాశనము చేసే వరకు ఇది యూదులకు పవిత్ర స్థలముగా ఉండెను. రోమా వారు ఈ పట్టణాన్ని పూర్తిగా స్వాధీనపరచుకొని ఈ పట్టణానికి “ఆలియా కాపిటోలినా” అను పేరు మార్చిననూ, యూదులు ఈ పట్టణాన్ని తిరిగి పొందటానికి ప్రయత్నించెడి వారు. “సైమన్‌బార్‌కోచ్బా” అను యూదుడు క్రీ.శ. 132-135 సంవత్సరాల మధ్య కాలంలో యెరూషలేమును స్వాధీనపరచు కొన్నను 324 వరకు ఇది రోమీయుల పాలనలోనే యుండెను. 324 నుండి 614 వరకు బైజాన్‌టైన్ అధికారంలో ఉండెను. 614 నుండి 638 వరకు పర్షియా వారి అధికారములో ఉన్నది. గత ఆరు దశాబ్దాల్లో ఇశ్రాయేలీయుల సంఖ్య పెరుగుతూ రాగా 362లో జూలియస్ అను రోమా చక్రవర్తి యూదులకు యెరూషలేమునిస్తానని వాగ్దానము చేసి దేవాలయమును నిర్మించుకొనుడనెను. 614లో పర్షియనులు మూడు సంవత్సరాల పాటు యూదులు పరిపాలించు కొనుటకు అనుమతి ఇచ్చారు.

రోమీయులు యెరూషలేమును నాశనము చేయుటకు పూర్వము రెండు లక్షల యూదులు మాత్రమే అందు నివసించెడి వారు. బైజెంటీయునుల పాలనలో అప్పటి జనసంఖ్య పెరుగుతూ తరుగుతూ వచ్చినది. అయితే 8 లక్షలకు ఎప్పుడూ మించలేదు.

638లో మహమ్మదు ప్రవక్త అనుయాయులైన ముస్లిములు యెరూషలేముపైకి దండెత్తిరి. అప్పుడు మక్కా ఆధీనములో పాలస్తీనా అంతయు ఉండెను. పరిపాలన సౌలభ్యము కొరకు రామెతె అను పట్టణము కేంద్రంగా ఉండెను. మధ్యధరా సముద్రానికి యెరూషలేముకు మధ్య నున్నదీ పట్టణము. యెరూషలేమును కేంద్రంగా చేసుకొని పాలించుటకు ముస్లింలు సాహసించలేదు. ఏడవ శతాబ్దానికి అందు జనాభా 30 వేలకు పడిపోయినది.

1099 వరకు యెరూషలేమును ముస్లింలు పరిపాలించారు. ఆ తరువాత క్రైస్తవులు ఈ పట్టణమును ముట్టడించారు. వారు ముస్లిములను యూదులను అమాను షంగా చిత్రవధ చేసిన కారణాన జనాభా 3వేలకు తగ్గి పోయినది. యెరూషలేములో కొంకాలము వరకు యూదులెవరూ ఉండెడివారు కాదు. క్రైస్తవులు యెరూష లేమును విడిచి వెళ్ళిన తరువాత తిరిగి యెరూషలేముకు చేరుకున్నారు యూదులు.

క్రైస్తవులు ఒక శతాబ్దానికి పైగా యెరూషలేమును పాలించిరి. మామ్లూకులు అనువారు మూడు శతాబ్దాలు పాలించారు. ఆటోమను టర్కులు 1518 నుండి 1917 వరకు పాలించారు. ఈ శతాబ్దాలలో అరబ్బు ప్రభుత్వమును మాట వినవే లేదు. వీలైనప్పుడల్లా యూదులు స్వదేశానికి వచ్చుటకు ప్రయత్నిస్తుండెడి వారు.

1844 కాలమునకు యెరూషలేములో యూదులే అధిక సంఖ్యాకులుగా ఉండెడివారు. అప్పటి జనాభా లెక్కల ప్రకారము 5000 మంది ముస్లిములు 3390 మంది క్రైస్తవులుండగా యూదులు 7120 మంది ఉండిరి. క్రైస్తవులు ఆరాధనలు జరుపుకొనుటకు మందిరాలు నిర్మించుకున్నారనిగాని వారు యెరూష లేమును వివిధమైన అభివృద్ధి చేయలేదు.

1870 నాటికి యూదుల జనాభా యెరూషలేములో అధికంగా ఉన్నది. 1872లో 5300 మంది క్రైస్తవులు 5000 మంది ముస్లింలు ఉండగా యూదులు 10600 మంది ఉండిరి. అప్పటి నుండి యూదుల జనాభా అధికం కాజొచ్చెను. 1905 లెక్కలనుబట్టి చూడగా 13000 మంది క్రైస్తవులు 7000 మంది ముస్లింలు ఉండగా, 40,000 మంది యూదులు యెరూషలేములో నివసించిరి. 1931 జనాభా లెక్కల ప్రకారం 19,000 మంది ముస్లింలు, 19,000 క్రైస్తవులు 51,000 మంది యూదులు ఉండిరి.

1948లో 25,000 మంది క్రైస్తవులు 40,000 మంది ముస్లింలు, 1,00,000 మంది యూదులు యెరూషలేములో నివసించెడి వారు. 1977 లెక్కల ప్రకారము మొత్తం 3,80,000 జనాభాలో 2,70,000 యూదులు యెరూషలేములో నివసించిరి. ఈ విధముగా యెరూషలేములో యూదుల సంఖ్య విస్తరింపసాగెను.

## ఇశ్రాయేలు ఆవిర్భావం

1948 సంవత్సరం మే నెల 14వ తేదీన ఇశ్రాయేలు దేశము తిరిగి అవతరించింది. చుట్టునున్న దేశములతో 27 రోజుల పాటు యుద్ధము జరిగినది. 24వ తేదీ ఫిబ్రవరి 1949 సంవత్సరములో ఐగుప్తుకు, ఇశ్రాయేలుకు మధ్య ఒక ఒప్పందము కుదిరినది. సిరియా, యొర్దాను, లెబానోనులు కూడా ఆ ఒప్పందముపై సంతకాలు చేశాయి.

1956లో సీనాయి యుద్ధము జరిగినది. అప్పటి అమెరికా ప్రెసిడెంట్ ఐసన్‌హూవరు జోక్యం కలుగు చేసుకొనుట ద్వారా ఇశ్రాయేలు ఆక్రమిత ప్రాంతమైన సీనాయిని విడచిపోగా గాజా ప్రాంతములో అంతర్జాతీయ సైనికులను గస్తీగాపెట్టి యుద్ధము జరగకుండా చేసిరి.

1967 – 6 రోజుల యుద్ధము

ముస్లిము దేశాలకు ఇశ్రాయేలు దేశాన్ని గుర్తించడము ఇష్టము లేదు. అప్పటి ఐపుగ్తు ప్రెసిడెంట్ నాజరు ఇశ్రాయేలు దేశాన్ని ప్రపంచపటంలో కనిపించ కుండా తుడిచివేస్తానని అన్నాడు. ఇశ్రాయేలు రక్షణ మంత్రి మోషేదయాన్ వీరోచితంగా పోరాడి విజయం సాధించాడు.

1973 – యోమ్‌కిప్పూరు యుద్ధము

అమెరికా ప్రసెడెంట్ ప్రపంచములోని అణుబాంబులను నిషేదినిచడంలో ఈ యుద్ధ భయు తొలగిపోయెను.

ఇశ్రాయేలులో నూతన రాజకీయ పరిణామాలు

అమెరికా ప్రత్యేక దూత కిసింజర్ రాయబారము 1976లో ఆగిపోగా యుద్ధ వాతావరణమే కనిపించెను. 1977లో ఇశ్రాయేలు దేశానికి లికుర్దుపార్టీ అధికారములోకి రాగా చాలా మార్పులు జరిగెను. అధిక మతాసక్తిగలవాడు మోషే నియమాలను తు.చ. తప్పక పాటించెడి హెమెనాహెమ్‌బిగిన్ అధికారమునకు వచ్చెను. వాగ్దాన భూమి కేవలం యూదులదే అను గట్టి నమ్మకం ఆయనది. యూదులు గుర్తింపబడిన జనాంగముగా 3,500 సంవత్సరాల నుండి జీవించుచుండిరి. చాలాకాలముగా చెదరిపోయిన వారు ఇప్పుడిప్పుడే స్వదేశానికి చేరుకుంటున్నారు.

ఇశ్రాయేలీయులు ఇతర దేశాల నుండి స్వదేశానికి తిరిగి వచ్చినప్పుడు వారు నూటికి మించిన భాషలు మాట్లాడెడివారు. వారిలో ఎక్కువగా మాట్లాడే భాష ఏదీ ఉండేది కాదు. ఇంగ్లీషు కూడ అధికంగా మాట్లాడెడివారు కాదు. అందుచేత హెబ్రీ భాష విధిగా నేర్చుకోవలసి వచ్చినది. ఆయా పాఠశాలల్లో హెబ్రీ భాష బోధించెడి వారు. అతి సులువైన హెబ్రీ పదాలను వెయ్యికి మించకుండ ఉపయోగించి హెబ్రీభాషలో పత్రికలు నడిపెడి వారు. కొన్ని పుస్తకాలు కూడ ప్రచురించెడివారు. క్రీ.పూ. 1000 సంవత్సరాల నాటి ఈ పురాతన భాషను ఆధునికరించారు. బైబిలులోని హెబ్రీ పదాలు చాలా ప్రాచీన పదాలు. భాషను ఆధునికరీంచటం సాహిత్య అకాడమీ వారిపైబడినది. 30 వేల పదజాలంతో ఒక నిఘంటువును ఈ అకాడమీ తయారు చేసింది. ఈ విధంగా హెబ్రీభాష శీఘ్రగతిని ఆధునీకరించ బడినది.

హెబ్రీ భాష పునరుద్ధరణను గూర్చి జెఫన్యా ప్రవక్త ప్రవచనం ఈలాగున్నది "అప్పుడు జనులందరు యెహోవా నామమునుబట్టి యేకమనస్కులై ఆయనను సేవించునట్లు వారికి పవిత్ర పెదవులనిచ్చెదను" (జెఫన్యా 3:9). ఇక్కడ పవిత్ర పెదవులు అను మాట ఇంగ్లీషు బైబిలులో పవిత్రమైన భాష అని ఉన్నది.

యెరూషలేము భౌగోళికముగా ప్రపంచ కేంద్రములో (మధ్య) నున్నది. తూర్పు పడమటి యెరూషలేమును కలిపెడి వంతెన ఒకటి ఉన్నది. ఆ పట్టణము యూదులు అరబ్బులతో కళకళలాడుతూ ఉండును.

టెడ్డీకాలెక్ అను నగర మేయరు నగరము వెలుపల బయట అభివృద్ధి కార్యక్రమములను చేపట్టి ఆధునికి సుందర నగరముగా యెరూషలేమును తీర్చిదిద్దాడు. అక్కడి వంతెన పురాతన, నూతన యెరూషలేములను కలుపు తున్నది. మోషేనపీ, గిల్బర్‌వీల్ అనువారు నగరమును ఆధునికరించటంలో వారి తలాంతులను ఉపయోగించారు. దావీదు గోపురము, జాఫాగేట్ పాతనగరపు గోడ, ఇవన్నీ కనిపించే విధంగా రోడ్లు నిర్మించి నగరాన్ని తీర్చిదిద్దారు. అక్కడకు వచ్చిన యాత్రికుల అవసరాలు తీర్చడానికి 615 గదులుగల రెండు పెద్ద హోటళ్ళ భవనాలను కట్టిరి. ఇంతవరకు ఎడారిగానున్న ప్రదేశాలను ఉద్యాన వనములుగా మార్చారు. యాత్రికులకు వినోద పర్యాటనకు వచ్చే వారికి యెరూషలేము పట్టణము బహు ఆకర్షణీయమైనది. ఇందు పురాతన నాగరికత ఆధునికి నాగరికత సమ్మిళితమై యుండును.

నూతన నిబంధనలతో దేవుని సంఘమును నూతన యెరూషలేముగా పోల్చబడుచున్నది. నజరేయుడైన యేసుతోనే యెరూషలేముకు క్రైస్తవునికి సంబంధమున్నది. ఆయన జీవితము, మరణమునకు సంబంధించిన స్థలములు ఎన్నో ఉన్నవి. పాత నగరములో యేసు సిలువ మరణము పొందిన స్థలము, ప్రార్థించిన గెత్సెమనేతోట, ఒలీవల కొండలు, కిద్రోను వాగు, పునరుత్థానుడైన స్థలాన్ని చూచి క్రైస్తవులు భక్తి పారవశ్యముతో ప్రార్థనలు చేయుచుందురు.

యెరూషలేము భవిష్యత్తును గురించి రెండురకాల ప్రవచనాలు ఉన్నాయి. కొన్ని శ్రమలను గురించినవి,

**...మిగతా 15వ పేజిలో**

# మార్టిన్ లూథర్



శ్రీమతి రిబ్కా విక్రాంత్

ప్రభువు నామమున **పరిశుద్ధత** పాఠకులకు శుభాభివందనములు. ఈసారి ఒక మిషెనెరి కథను నేర్చుకుందాము.

మార్టిన్ లూథర్ జర్మనీ దేశములోని ఈజిల్‌బెన్ గ్రామములో 1483వ సంవత్సరములో ఒక పేద కుటుంబములో జన్మించాడు. అతని తల్లిదండ్రులకు ఏడుగురు సంతానము. తన సొంత గ్రామములోనే ప్రాథమిక చదువు ప్రక్క పట్టణమైన మాగ్డెబర్గ్ వెళ్ళాడు. అతనిని చదివించే స్తోమత తల్లిదండ్రులకు లేదు. ఏదైనా పని సంపాదించి చదువుకోవాలని ఈ పట్టణానికి వచ్చాడు. ఒక స్త్రీతో తన సమస్యను వివరించగా ఆమె ఒక షరతు మీద సహాయము చేయుటకు ఒప్పుకొన్నది. నీవు నా ముందే ఇక్కడే ఉంటూ చదువుకోవాలి. నీకు కావలసినవన్నియు నేను ఇస్తాను అన్నది. ఆమెకు పిల్లలు లేరు. వితంతువు ఒంటరిగా ఉంటున్నది. ఇది తప్పక దేవుని ఏర్పాటై ఉంటుందని ఒప్పుకున్నాడు. అలా మార్టిన్ నాలుగేండ్లపాటు ఆమె దగ్గరే ఉంటూ ఏ కొరతా లేకుండా విద్యాభ్యాసం సాగించాడు.

మార్టిన్ వయసు అప్పుడు 18 సంవత్సరాలు. తండ్రి యొక్క ఆర్థిక పరిస్థితి మెరుగై మార్టిన్‌ను ఎర్ఫర్ట్ యూనివర్సిటీలో చేర్చగలిగాడు. తండ్రి ఉద్దేశం మార్టిన్ న్యాయశాస్త్రం చదివి న్యాయవృత్తి చేపట్టాలని. మార్టిన్ ఎంతో తెలివిగలవాడు. తన మాటల్లో చేతల్లో ఎంతో చతురత ప్రదర్శించేవాడు. గొప్ప గాయకుడు. వాద్యకారుడు చక్కగా పాడుచు ఫ్లూట్ వాయిస్తూ ఫ్రెండ్స్‌ను వినోదింపజేసెడి వాడు.

1502లో మార్టిన్ పట్టభద్రుడయ్యాడు. 1505లో ఎం.ఏ. ఉత్తీర్ణుడై క్లాసులోని పదిహేడు మందిలో రెండవ వాడుగా వచ్చాడు. యూనివర్సిటీ విద్య కొనసాగించుచుండగా ఒకనాడు లైబ్రరీలో బైబిలు గ్రంథమును చూశాడు. దానిని తన గదికి తెచ్చుకొని ఎంతో శ్రద్ధగా చదివాడు. న్యాయశాస్త్ర పుస్తకాలకు బైబిలు చదవటంలోనే తన కాలమును గడిపెడివాడు. దేవుని గూర్చిన సత్యాలను తెలుసుకోవాలని ఉబలాటపడేవాడు.

తల్లిదండ్రులగు మార్గరేట్ హాన్స్‌లూథర్ పిల్లలను చక్కని క్రైస్తవ క్రమశిక్షణలో పెంచారు. బాల్యము నుండే వీరికి మతాచారాలు పదిఆజ్ఞలు, పరలోక ప్రార్థన మరికొన్ని కీర్తనలను నేర్పించారు. బైబిలులోని వచనాలను కంఠస్థం చేయించారు. అప్పట్లో పిల్లలకు వారి పాపాలకు వారే ప్రాయశ్చిత్తం కోరుకోవాలని నేర్పెడివారు. మేరిమాతను, మరి ఇతర పరిశుద్ధులను వేడుకోమని క్రీస్తును తమ పట్ల దయచూపించమని మొదలుగనవి నేర్పెడివారు.

యూనివర్సిటీ జీవితం ముగియక ముందే మార్టిన్ జీవితంలో గొప్ప విప్లవాత్మకమైన మార్పులు జరిగినవి. బైబిలును క్షుణ్ణంగా పఠించి అర్థము చేసుకున్నాడు. అప్పటి మత విశ్వాసాలు చాలా వరకు బైబిలు సంబంధమైనవి కావని తెలుసుకున్నాడు. ఒకసారి జబ్బుపడి మరియు మరణావస్థలో నుండి సెయింట్ ఏన్, నన్నీలోకబంధాల నుండి విముక్తుణ్ణి చేయి. నేను సన్యాసినైపోతాను అన్నాడు. కొన్నాళ్ళకు అగస్టీన్ తరగతికి చెందిన సన్యాసుల మఠంలో చేరెను. న్యాయశాస్త్రం

చదువుతూ ఈ విధంగా మారడం తండ్రినెంతో కలవరపరచెను.

అప్పటి ఆ మఠ నియమాల ప్రకారం పేదరికం సచ్ఛీలం, విధేయతకు కట్టుబడి ఉండటానికి శపథం చేశాడు. గనుక ఇప్పుడు సన్యాసిగా భిక్షమెత్తుకొనడానికి సిగ్గు పడనక్కరలేదు. పై చదువులు చదివిన మాపిన్ వీధుల వెంట భిక్ష మెత్తుకోవడం యూనివర్సిటీ ఆచార్యులకు బాధాకరంగా ఉండేది. వారి కళ్ళ ముందు ఇళ్ళ ముందు ఘోరం చూడలేక పట్టణ వీధులు వదిలేసి గ్రామాలకు పోయి భిక్షాటన చేయమని నచ్చజెప్పుటకు ప్రయత్నించారు.

1507 ఫిబ్రవరిలో మార్టిన్ అభిషిక్తుడైనాడు. అతడు ప్రథమ 'మాస్' ఉత్సవం జరుపుకున్నవాడు. అతనికెన్నో కానుకలు వచ్చాయి. అందులో ఎర్రని చర్మపు అట్టగల బైబిలు కూడా ఉన్నది. అతడు బైబిలులోని సత్యాలను గ్రహించాలనే ఆత్రుతలో ఉన్నాడు. బైబిలును పట్టుదలగా శ్రద్ధగా చదవటం మొదలుపెట్టాడు. సన్యాసి మఠంలో తన శరీరాన్ని నలుగగొట్టి లోబరచుకొనుటకు ప్రయత్నించెడివాడు. మనశ్శాంతి కోసం తపిస్తూ ఎన్నో దినాలు ఉపవాసముండి ధ్యానంలో నిమఘ్న మయ్యేడివాడు. ఎన్నో రాత్రులు జాగరణ చేస్తూ వాక్యమును పరిశోధించాడు. అయినను అతని ఆత్మకు శాంతి కలుగలేదు. దేవుడు అతని సమస్యకు తొందరలోనే పరిష్కారం చూపించాడు. పశ్చాత్తాపం గురించి దేవుడు అతనితో మాట్లాడాడు.

1508వ సంవత్సరానికి లూథర్‌కు 25 ఏళ్ళు నిండినవి. ఆధ్యాత్మికంగాను, సాహిత్యపరంగాను అతడు చూపిన ప్రజ్ఞకుగాను నూతనముగా స్థాపింపబడిన విటెన్‌బర్గు యూనివర్సిటిలో మార్టిన్‌ను ఆచార్యునిగా నియమించారు. మానెస్ట్రిలో ఉన్న మూడేళ్ళకాలంలో మార్టిన్ గ్రీకు, హీబ్రూ భాషలను క్షుణ్ణంగా నేర్చుకున్నాడు. జర్మన్ భాష మాతృభాష కాబట్టి ఆ భాషలో విశేష పాండిత్యాన్ని సంపాదించాడు.

ఆ దినాల్లో అభిషేకింపబడిన మత గురువులు తప్ప మరెవరూ పరిశుద్ధ గ్రంథము చదివి ఎరుగరు. మార్టిన్ బైబిలు చదివి బైబిలు జ్ఞానము విపరీతంగా పెంచుకున్నాడు. నీతిమంతులు విశ్వాస మూలముగా జీవింతురు రోమా 1:17 అను వాక్యము ఆయన హృదయాన్ని గట్టిగా తాకెను. అంతట బైబిలు చదవటం మాత్రమే కాకుండా వాక్యపరిశోధన చేయుచు వాక్యపు వెలుగులో తెలిసికొన్న నిజాలనుబట్టి అప్పటి రోమా సంఘంలోని లోపాలను బహిర్గతము చేసి చర్చిలో కొన్ని మార్పులు చేయవలసి ఉందని రోమన్ కేథలిక్ చర్చి వాక్యానికి వ్యతిరేక పంథాలో నడుస్తుందనే యథార్థమును అవగతం చేసుకొనెను. అగస్టినియన్ల వ్యవహారం మీద మరొక సన్యాసితో పాటు "శాశ్వత నగరము" అని పిలువబడుచున్న రోమ్ నగరానికి వెళ్ళాడు.

ఆరువారాల పాటు కాలినడకన ప్రయాణం చేసి రోమ్ నగరము చేరుకున్నాడు. "పవిత్ర నగరం" అని దానికి పేరు. ఆ నగరం చేరగానే గవిని దగ్గర నేల మీద సాష్టాంగపడి పవిత్ర రోమ్ నగరమా! నీకు నమస్సులు అని కేకవేశాడు మార్టిన్. రోమ్ నగరంలో ప్రవేశించిన తరువాత అది సొదొమ గొమొఱ్ఱాలకేమి తీసిపోని పాప పంకిలమైన నగరమని తెలుసుకున్నాడు. స్కాలా, స్కాంటా అని పిలువబడే పిలాతు మెట్లు మోకాళ్ళ మీద ఎగబ్రాకుతున్నప్పుడు (ఇది పాప పరిహారార్థానికి ఒక సూత్రం) "నీతిమంతులు విశ్వాస మూలముగా జీవింతురు" అనే స్వరము వినిపించినది. ఇదే "మహా సంస్కరణ"కు మూలమైనది. రోమ్ నగరం గురించి లూథర్ ఒకసారి మాట్లాడుచు "రోమ్ ఒక వేశ్య. ఆ నగరం అపవిత్రత ఎంత గొప్పది. విచ్చలవిడి గలది అంటే అక్కడ దేవునికిగాని నరునికి గాని పాపానికిగాని భయపడే వారు లేరు. సిగ్గు, లజ్జలేని నగరమది. ఆ నగరం దర్శించిన మంచి వారెవరైనా అక్కడికి వెళ్ళి తిరిగి వచ్చిన తరువాత బహు నీచులుగా మారిపోతారు" అన్నాడు.

తిరిగి యూనివర్సిటీకి రాగానే అతనిని వేదాంత కళాశాలకు డీన్‌గా నియమించారు. మరుసటి సంవత్సరంలో అనగా 1512లో ఆయనను డాక్టరేట్ బిరుదుతో సత్కరించారు.

ఇక ఆయన క్రైస్తవ వేదాంత బోధ ఇప్పుడు క్రొత్త పుంతలు త్రొక్కసాగెను.

బైబిలును గురించి మార్టిన్ లూథర్ గొర్రెల మందకు పచ్చిక బయలు, మనిషికి గృహము, పక్షికి గూడు, కొండ జింకకు బండరాయి, చేపకు కాలువ ఎలాగో విశ్వాసి ఆత్మకు బైబిలు ఆలాగునున్నది. అని సూత్రీకరించాడు. మత గురువులు పాప క్షమాపణ పత్రాలు అమ్ముకుంటూ సొమ్ము చేసుకొని సంపన్నులై పోతున్నారు. వారి దూతలు "కాసులు పెట్టెలో గలగలమంటున్నప్పుడే రండి కొనండి, ఆత్మలను ప్రక్షాళనం చేసుకొనండి అంటూ వీధులలో కేకలు వేయుచు పాపక్షమాపణ పత్రాలు అమ్మేవారు.

నరులు విశ్వాస మూలముగానే జీవిస్తారని ధృఢముగా నమ్మిన లూథర్ ఈ పిచ్చి పనులను సహించెడి వాడు కాదు. ధైర్యముగా పాపక్షమాపణ వ్యాపారాన్ని విమర్శించెడి వాడు. ధైర్యముగా పాపక్షమాపణ వ్యాపారాన్ని విమర్శించెడి వాడు. ఇది జరిగిన 8 నెలల తరువాత 31 అక్టోబరు 1517లో తొంభై ఐదు సూత్రాల ఫలకాన్ని విటెన్‌బర్గు దేవాలయ తలుపుకు సీలలతో బిగించాడు. బైబిలు విరోధపు సూత్రాలను ఖండించుచు పలుచోట్ల బహిరంగంగా ప్రసంగించాడు. పోపు సర్వాధికారి కాదని పాపమెరుగని వాడనటం పచ్చి అబద్ధమని స్పష్టంగా వెల్లడించాడు.

**ఆయన బోధల సారాంశమిది**

1. సర్వలోక పాపపరిహారార్థమై యేసుప్రభువు యూదుల వలన శ్రమలననుభవించి మరణమై తిరిగి లేచి ఆరోహణుడై ఇప్పుడు తండ్రి కుడి పార్శ్వమున ఉన్నాడనియు ఆయన ద్వారా లోకమందలి ప్రజలకు రక్షణ కలుగునని విశ్వసింపవలెను. 2. విశ్వాసమునకు బైబిలే ఆధారము. 3. అఖిల విశ్వాసుల సార్వత్రిక యాచకత్వ సిద్ధాంతమును వేదవాక్యపరముగా ప్రతిపాదించెను. 4. నిర్మలమగు సౌవార్తిక సిద్ధాంతమును వెల్లడి చేసెను. 5. వాక్యమునకు విరోధముగానున్నవి మాత్రమే మార్పు చేసెను.

లూథరు అనుచరులు "లూథరనులు" అని పిలువ బడిరి. ఏది లూథరుకు నచ్చలేదు. లియా-ఎక్స్ అనే పోపుచే వీరు లూథరనులు అని పిలువబడిరి. సన్యాసాన్ని వ్యతిరేకించి ఒక సన్యాసినిని కేథరిన్, వాన్‌బోరా అను నామెను పెండ్లడాడు. అంతట మానెస్ట్రీలు ఖాళీ అయిపోయి స్త్రీ పురుషులు సంసారజీవితం ప్రారంభించారు. పోపు దీనిని సహించలేకు దీనికి కారణభూతుడైన లూథరును క్షమాపణ చెప్పమని కోరగా అందుకు లూథరు అంగీకరించకపోగా అతడు సంఘము నుండి వెలివేయబడెను. అతనిని చంపుటకు ప్రయతినంచగా పోపు వ్యతిరేకియగు జర్మను రాజు తన నివాసమైన "వార్డ్‌బర్గ్" కోటలో అతనిని దాచిపెట్టను. ఈ కాలములోనే క్రొత్త నిబంధన గ్రంథాన్ని లూథర్ జర్మను భాషలోనికి అనువదించెను. ఈ కోటలో భద్రపరచబడి యున్నప్పుడే "మా కర్త గట్టి దుర్గము" అను పాట మరికొన్ని ఇతర పాటలను రచించాడు. ఆయా సమయాలలో వ్రాసిన కీర్తనలన్నిటిని కలిపి ఒక కీర్తన గ్రంథముగా ప్రచురించి ప్రజలకందించాడు.

ఈయన సిద్ధాంతముల నంగీకరించి, కేథలిక్ సిద్ధాం తాల నెదిరించి వారు "అసమ్మతి వాదులు" (Protestants) అని పిలువబడిరి. మతోద్ధరణగా అంగీకరించిన క్రైస్తవ శాఖలన్నిటిని ప్రొటెస్టెంటు శాఖలని నేటికిని పిలువబడు చున్నవి.

లూథరు సంఘములోని దురాచారములను మాత్రమే ఖండించెనుగాని క్రైస్తవ్యము ఈ రీతిగా రెండు శాఖలుగా చీలిపోవునని తలంచలేదు. మార్టిన్ లూథర్ చేసిన సంస్కరణ ఫలితంగా ఈయనను సంస్కరణ పితరుడు (Father of Reformation) అని పిలిచిరి. లూథరు 1546, 18వ తేదీన ఉదయం తన దేహమును విడిచి, ప్రభువుతో నుండుటకు నిత్యవిశ్రాంతిలోని ప్రవేశించినాడు.

దేవుడు మిమ్మును దీవించును గాక!



# అక్షరయజ్ఞం



## బైబిల్ క్విజ్ - 2

శ్రీమతి కె. ప్రసన్న పరాక్రమ్

1. కయీను, హేబేలు తర్వాత ఆదాము, హవ్వలకు పుట్టిన కుమారుని పేరేమి?
2. షేతు పుట్టినప్పుడు ఆదాము వయస్సు ఎంత?
3. ఆదాము ఎన్ని సంవత్సరాలు జీవించెను?
4. నోవహు తండ్రి పేరేమి?
5. నోవహు కుమారుల పేర్లేమి?
6. దేవుడు ఏ చెక్కతో ఓడను నిర్మించమని నోవహుతో చెప్పెను?
7. ఓడ పొడవు, వెడల్పు, ఎత్తు ఎంత?
8. ఓడ ఎన్ని అంతస్తులుగా నిర్మించమని దేవుడు చెప్పెను?
9. ఓడలోనికి ఎవరెవరు ప్రవేశించారు?
10. నోవహు యొక్క వయస్సు ఏ దినమున వర్షము ప్రారంభమాయెను?
11. ఎన్ని దినములు వర్షము కురిసెను?
12. నీళ్ళు ఎన్ని మూరల ఎత్తుగా నిలిచెను?
13. ఎన్ని దినముల వరకు నీరు భూమి మీద ప్రచండముగా ప్రబలెను?
14. నోవహు కుటుంబముతో పాటు ఇంకా ఏవి ఓడలో ప్రవేశించెను?
15. ఎన్ని దినముల వరకు నీరు క్రమముగా తగ్గుతూ వచ్చెను?
16. ఓడ ఏ కొండల మీద ఆగెను?
17. నోవహు ఓడలో నుండి మొదటగా ఏ పక్షిని బయటకు పంపెను?
18. రెండవసారి ఏ పక్షిని బయటకు పంపెను?
19. మూడవసారి పక్షిని బయటకు పంపినప్పుడు అది ఏ చెట్టు ఆకు నోటితో తెచ్చెను?
20. నోవహు వయస్సు ఏ దినమున వారు ఓడలో నుండి బయటకు వచ్చిరి?
21. నోవహు కుటుంబము ఎన్ని దినములు ఓడలు నివసించిరి?
22. జలప్రళయము వలన మానవులతో చేసిన నిబంధనకు గుర్తుగా మేఘములో ఏమి వుంచెను?
23. బాబేలు అనగా అర్ధము ఏమిటి?
24. బాబేలు గోపురమును ఏ దేశములో నిర్మించెను?
25. నోవహు ఎన్ని సంవత్సరములు జీవించెను?

**గమనిక :** ఈ ప్రశ్నలన్నిటికి సమాధానాలు బైబిలు నుండి గ్రహించవచ్చును. మీరు ఈ బైబిల్ క్విజ్‌లో పాల్గొనటం ద్వారా బైబిలు జ్ఞానమును సంపాదించాలన్నదే మా ఉద్దేశ్యం. కావున ప్రతి ఒక్కరూ ఈ బైబిల్ క్విజ్‌లో పాల్గొని బైబిలు జ్ఞానము సంపాదించటంతో పాటు బహుమతులు గెలుపొందవలసినదిగా కోరుచున్నాము.